విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

సోమవారం 5 ఆగస్టు, 2024 8 పేజీలు

రాష్ట్ర మంత్రులను కలిసిన శ్రీసిటీ ఎండీ

విశాలాంధ్ర-సత్యవేడు: రాష్ట్ర రాజధానిలో తన రెండు రోజుల పర్యటనలో శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి పలువురు రాష్ట్ర మంత్రులను మర్యాదపూర్వకంగా కలిశారు. ముఖ్యమంత్రితో భేటీ అనంతరం పలువురు క్యాబినెట్ మంత్రులతో సమావేశమై చర్చించారు. వీరిలో వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి టిజి భరత్ తో పాటు గతంలో తనతో, శ్రీసిటీతో సాన్నిహిత్యం వున్న పట్టణాభివృద్ధి, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, వైద్య విద్య మంత్రి సత్య కుమార్ యాదవ్, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ మంత్రి డాక్టర్ పి.నారాయణ, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి వున్నారు. మంత్రులతో చర్చల సమయంలో శ్రీసిటీ ప్రస్తుత స్థితి, కొనసాగుతున్న మరియు చేపట్టనున్న వివిధ పారిశ్రామిక ప్రగతి ప్రణాళికలను వారికి వివరించారు. శ్రీసిటీని సందర్శించి పురోగతిని ప్రత్యక్షంగా చూడాలని ఆయన మంత్రులను ఆహ్వానించారు. ఆహ్వానం పట్ల వారు సానుకూలంగా స్పందించారు. పారిశ్రామిక కేంద్రం అభివృద్ధిని పరిశీలించడానికి ఆసక్తిని వ్యక్తం చేశారు.

అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన

నిందితులను తక్షణమే అరెస్టు చేయాలి

సామాజిక హక్కుల వేదిక జిల్లా కార్యదర్శి చిన్నం పెంచలయ్య డిమాండ్

విశాలాంధ్ర -వెంకటగిరి: ప్రపంచం గర్వించదగ్గ మేధావి భారతదేశ ప్రజల అత్యుత్తమ మహోన్నతుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన అగ్రకుల అహంభావం కలిగిన నిందితులను తక్షణమే గుర్తించి అరెస్టు చేయాలని సామాజిక హక్కుల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య డిమాండ్ చేశారు. వెంకటగిరి అడ్డరోడ్ సెంటర్ దగ్గర ఉన్న అంబేద్కర్ విగ్రహం ధ్వంసానికి పాల్పడి ఇప్పటికి 84 రోజులైనా పోలీసులు రెవెన్యూ అధికారులు పట్టించుకోనందుకు నిరసనగా దళిత సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో పంజాం ధనంజయ అధ్యక్షతన నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమంలో సామాజిక హక్కుల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య పాల్గొని మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అందరి వాడిని ఒక జాతి పక్షాన ముద్ర వేసి ఆ జాతికే చెందిన వ్యక్తిగా చిత్రీకరించడం సమచితం కాదన్నారు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ దేశంలో ఉన్నన్ని విగ్రహాలు ఈ దేశంలో మరే నాయకుడికి లేదని ఆయన గుర్తు చేశారు జ్ఞానం అంటే అంబేద్కర్ అని సమాజానికి సాటి చెప్పిన వ్యక్తి విగ్రహాన్ని ధ్వంసం చేయడం అత్యంత హేయమైన చర్యని ఆయన తీవ్రంగా ఖండించారు సమాజంలో జరుగుతున్న అనేక అసమానతలకు వ్యతిరేకంగా కుల దంతర్ల కుల దోసి తమ సమాజ నిర్మాణం కోసం అనేక పోరాటాలు నిర్వహించి దేశానికి దశ దిశ నిర్దేశం పాలన ఎలా ఉండాలో రాజ్యాంగం ద్వారా అందించిన గొప్ప మేధావిని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో డి రామకృష్ణ మాట్లాడుతూ అంబేద్కర్ గొప్ప ఆశయాల కోసం ఈ దేశంలో ఉన్న అసమానతలు తొలగించడం కోసం ఆయన వేసిన సేవలను విస్మరించిన కుల దురహంకారులు ఇలాంటి దారుణానికి ఒడి కట్టడం మంచిది కాదన్నారు. వెంటనే వాళ్ళని అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. పంజాం ధనంజయ, ఆర్టీసీ భాస్కరన్న,సుధాకర్, ఎన్.శివ, గోపాల్, రమేష్ కుమార్, బాబు తదితరులు విగ్రహ ధ్వంసాన్ని ఖండిస్తూ తక్షణమే ప్రభుత్వం పూనుకొని తిరిగి విగ్రహ ప్రతిష్టా పనకు అంబేద్కర్ భవన ఏర్పాట్లకు చర్యలు తీసుకొని అంబేద్కర్ ఆత్మ గౌరవాన్ని కాపాడాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బాబురావు అనేకమంది దళిత నేతలు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం అన్ని విధాల సహకారం అందిస్తుంది

కేంద్ర సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ

విశాలాంధ్ర -చిత్తూరు : ఆంధ్ర రాష్ట్రం అభివృద్ధి కోసం కేంద్రం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమ శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ తెలిపారు. ఆదివారం కానిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని ఆయన దర్శించుకున్నారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడీ రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్ర రాష్ట్రానికి మంచి రోజులు వచ్చాయన్నారు. ప్రధాన్ నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో ప్రపంచంలోనే భారతదేశంలో అతిపెద్ద శక్తిగా ఎదిగే అవకాశం ఉందన్నారు . ఆంధ్రప్రదేశ్ కు గత ఐదు సంవత్సరాలు గ్రహణం పట్టుకుందని, రానున్న రోజుల్లో చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్ర ప్రదేశ్ అన్ని విధాలుగా అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. కేంద్రం కూడా రాష్ట్ర అభివృద్ధి కోసం ఇప్పటికే నిధులు కేటాయించడం జరిగిందన్నారు. ఇందులో బాగానే 15,000 కోట్లను కేంద్ర మంజూరు చేసినట్లు చెప్పారు. ఎస్సీ వర్గీకరణ పై ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో కేంద్ర ప్రభుత్వ పాత్ర లేదన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న కూటమి ప్రభుత్వం

అవినీతి అక్రమాలకు పాల్పడిన వారికి శిక్ష తప్పదు: మంత్రి కొలుసు

విశాలాంధ్ర - తిరుపతి : రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని, గత ప్రభుత్వంలో భూ కబ్జాలు, అవినీతి అక్రమాలకు పాల్పడిన వారికి శిక్ష తప్పదని స్పష్టం చేస్తూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా వారి సూచనల మేరకు రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి వారికి అందరికీ తక్కువ ధరలో ఇల్లు అందచేయాలని సంకల్పించి చర్యలు చేపడుతున్నామని , పురోగతిలో ఉన్న, పెండింగ్ లో ఉన్న టిడ్కో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం ఇళ్లను సంవత్సరంలో లబ్ధిదారులకు పూర్తి చేసి అందించేలా లక్ష్యాలు నిర్దేశించుకుని గృహ నిర్మాణ శాఖ పని చేస్తోందని పేర్కొన్నారు. ఆదివారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుని మధ్యాహ్నం అలిపిరి చేరుకున్న మంత్రి పార్థ సారథికి యాదవ సంఘం నేతలు పెద్ద ఎత్తున సన్మానం చేసి బస్ స్టాండ్ సమీపంలోని యాదవ భవన్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. యాదవ భవన్ కు చేరుకున్న మంత్రికి టీడీపీ నేతలు పలువురు మరియు యాదవ సంఘం నేతలు ఆత్మీయ స్వాగతం పలికి సన్మానించారు. మీడియాతో మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన టిడ్కో ఇళ్లను గత వైఎస్ఆర్సీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసి లబ్ధిదారులకు పలు ఇబ్బందులు గురి చేసిందని, ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాబోయే రోజుల్లో ఈ రాష్ట్రం లో ప్రతి పేదవాడికి కూడా ఇల్లు నిర్మించాలని పేద మధ్య తరగతి ప్రజలకు తక్కువ ధరలో ఇంటి కల సాకారం అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని, పురోగతిలో ఉన్న, పెండింగ్ టిడ్కో పీఎంఎవై ఇళ్ళ నిర్మాణాలను సంవత్సరం నాటికి పూర్తి చేసి లబ్ధిదారులకు అందించేలా గృహ నిర్మాణ శాఖ చర్యలు తీసుకుంటోందని తెలిపారు. తిరుపతి తనకు సుపరిచితమే అని తాను ఉమ్మడి చిత్తూరు జిల్లా ఇన్చార్జి మంత్రిగా ఉండి ఉన్నానని తెలిపారు. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రం 20 సం.లు వెనక్కి వెళ్లిందని తెలుపుతూ, ఇప్పుడు మళ్లీ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం పూర్వ వైభవం తేవడానికి ముఖ్యమంత్రి అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. గత పాలనలో భూ కబ్జాలు, అక్రమాలకు పాల్పడిన వారికి శిక్ష తప్పదని, వారి బాధితులకు తప్పక న్యాయం జరిగేలా కూటమి ప్రభుత్వ నాయకత్వంలో చూస్తామని తెలిపారు టిడ్కో ఇళ్లపై బ్యాంకుల నుండి తీసుకున్న రుణాలను దారి మళ్లించారు అని, టిడ్కో లబ్ధిదారులను మానసిక క్షోభకు గురిచేశారు అని గుర్తు చేశారు. మంత్రిని తిరుపతి శ్రీ పద్మావతి అతిథి గృహం నందు స్థానిక తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు నరసింహ యాదవ్, పలువురు తెలుగు దేశం నాయకులు, తెలుగు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు లక్ష్మీ పతి నాయుడు, మాజీ సర్పంచ్ అన్నా రామకృష్ణ యాదవ్, అన్నా అనిత కార్పొరేటర్, ధనుంజయ్ రెడ్డి టిడిపి లీడర్ తదితరులు పాల్గొన్నారు.

పొలంలో వ్యవసాయం జరగదు

గ్రామాల్లో తాగునీటి లో రంగులు నీళ్లు కాలుష్యం
చర్మ, కిడ్నీలు, లివర్ అనారోగ్యానికి గురవుతున్న ప్రజలు
అధికారులు లంచల్లో కూరుకుపోయారని రైతులు, గ్రామస్తుల ఆవేదన

విశాలాంధ్ర - పుత్తూరు టౌన్ : నారాయణ వనం మండలం కేంద్రములోని అరుణానధిలో రంగు కాలుష్యంతో అరుణానది రంగు పరిశ్రమల నుండి వెలువడే మోతాదుకు మించి వాడిన రసాయన రంగు నీళ్లతో అరుణానది కాలుష్యానికి గురై భూగర్భ జలాలు కలుషితమవుతోంది. మండల కేంద్రంలో పదుల సంఖ్యలో డైయింగ్ యూనిట్లను కుటీర పరిశ్రమలుగా నడుపుతున్నారు. రంగు పరిశ్రల నుండి వెలువడే వ్యర్థ నీరు శుద్ధి కాకుండానే అరుణానదిలో కలిసిపోతోంది. రంగు నీళ్లతో ఇప్పటికే నారాయణవనంలోని భూగర్భ జలాలు కాలుష్యానికి గురై నీటి రంగు, రుచి మారిపోయింది. మండలంలో నారాయణవనం, కీళగరం, సముదాయం, వెతల తడుకు బొప్పరాజు పాళ్యం పలు ప్రాంతాలలో సాగునీటిపై కాలుష్య ప్రభావం తప్పలేదు. తమిళనాడులో కాలుష్య నియంత్రణలో భాగంగా అక్కడి ప్రభుత్వం కాలుష్య కారక పరిశ్రమలపై కఠినంగా వ్యవహరిస్తోంది. దీంతో రెండేళ్ల క్రితం ఆ రాష్ట్రంలోని ఈరోడ్ ప్రాంత వాసులు స్థానికంగా ఎర్పాటు చేసిన రంగు పరిశ్రమ నుండి మోతాదుకు మించి రసాయణాలు అరుణానదిలో కలుస్తోంది. కురుస్తున్న వర్షాలకు నదిలో వర్షపు నీటితో రంగు నీరు కలవడం జలచర రాశులకు ప్రమాదం తప్పలేదు. పశువులు, మేకలు, గొర్రెలతో పాటు పంట పొలాలు దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. పిర్యాదులు అందడంతో ఏడాది క్రితం మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో అరుణానది కాలుష్యంపై చర్చించి జిల్లా కాలుష్య నియంత్రణ అధికారులకు చర్యల నిమిత్తం సిఫారసు చేశారు.

పొలంలో వ్యవసాయం జరగదు

(మొదటి పేజి తరువాయి) అధికారులు నామమాత్రంగా నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. మరమ్మగ్గ కార్మికులకు జీవనోపాదిని కల్పిస్తున్న రంగు పరిశ్రల జల వ్యర్థాలను ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటుతో శుద్ధి చేసి జల కాలుష్యం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులతో పాటు ప్రజాప్రతినిధులపై ఉంది.

పాకాల తహసిల్దార్ గా నిత్యానంద బాబు

విశాలాంధ్ర - పాకాల : పాకాల మండల తహసిల్దార్ గా జె . నిత్యానంద బాబు ఆదివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఎన్నికలకు మునుపు కలెక్టరేట్ లో పనిచేసిన ఆయన ఎన్నికల సందర్భంగా బదిలీ పై ఇతర జిల్లాకు వెళ్లారు. ప్రస్తుతం ప్రభుత్వం ఆయనను పాకాల మండల తహసిల్దార్ గా బదిలీ చేయడంతో పాకాల మండల తహసిల్దార్ కార్యాలయంలో ఆదివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు . ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన అనంతరం పలువురు రెవెన్యూ సిబ్బంది ఆయనకు అభినందనలు తెలియజేశారు . ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ లు మోహన్ ,పరదేశి వీఆర్వోలు లోకేష్ , హరికృష్ణ ,చక్రపాణి ,లక్ష్మీపతి ,లక్ష్మి మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు జాతీయ స్థాయి తెలుగు భాషా పోటీలు

విశాలాంధ్ర-పలమనేరు : రానున్న తెలుగు భాషా దినోత్సవం తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో పాఠశా ల స్థాయి విద్యార్థులకు వివిధ భాష పోటీలు నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షులు పి తులసినాథం నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. ఆరు ఏడు తరగతుల విద్యార్థులు తెలుగు భాషా గొప్పతనం అనే అంశంపై రెండు పేజీలు మించని వ్యాసం, 8 నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులు నేటి తెలుగు భాషా దుస్థితి అనే అంశంపై మూడు పేజీలకు మంచం వ్యాసం రాసి ఈనెల 15వ తేదీ లోపు పి.తులసి నాథంనాయుడు , కళామందిరం, సాయి గార్డెన్ సిటీ, గంగవరం, పలమనేరు, చిత్తూరు జిల్లా చిరునామాకు ప్రభుత్వ తపాల ద్వారా పంపాలన్నారు.1 నుండి 5 తరగతుల విద్యార్థులు వందకు పైగా నీతి పద్యాలు చెప్పగలిగే వారు 9553429770 అనే నెంబర్ కు ఫోన్ చేసి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.ఒక్కో విభాగం నుంచి 20 మంది చొప్పున మొత్తం 60 మంది పిల్లలకు తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా కళా మందిరం లో బహుమతులు అందిస్తామన్నారు మాతృభాషల్లో బోధనకు వినతీ నూతన జాతీయ విద్యావిదానం 2020 ప్రకారం పాఠశాల విద్య మాతం భాషల్లో జరిగేలా కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకురావాలని ఆదివారం పలమనేరు కు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ఎన్. కిరణ్ కుమార్ రెడ్డికి తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు పి. తులసినాథం నాయుడు వినతిపత్రం అందించారు

ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి ఆత్మీయ సమావేశం

విశాలాంధ్ర-పలమనేరు : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డిని వారి నివాసంలో కలసి తేనేటి విందులో ఆదివారం పాల్గొన్నారు.అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ అమర్నాథ్ రెడ్డి తండ్రి మా తండ్రి మంచి మిత్రులని, నేను అమర్నాథ్ రెడ్డి అదే విధమైన స్నేహాన్ని కొనసాగిస్తున్నామని, శాసన సభ్యులుగా ఇద్దరు చాలా సంవత్సరాలు పనిచేశామని, ఆయన తెలియజేశారు. జనసేన, బిజెపి తెలుగుదేశం, కూటమిగా ఏర్పడి, ప్రజలు ఇచ్చిన అబ్సల్యూట్ మెజారిటీతో, అధికారంలోకి రావడం జరిగింది అని, ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. అమరావతి రాజధాని నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా 15 వేల కోట్లు ఇవ్వడానికి సన్నాహాలు జరుగుతున్నాయని, ఆంధ్రప్రదేశ్ నుఅన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపాలని, చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నదని తెలియజేశారు.దేశంలోనే అతిపెద్ద మరియు గొప్ప ప్రాజెక్టు పోలవరమని, పోలవరం పూర్తయితే, 7,20,000 ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు మరియు గోదావరిలో10 లక్షల ఎకరాలకు స్థిరీకరణ, కృష్ణా బేసిన్ కింద 13 లక్షల ఎకరాలకు స్థిరీకరణ. మొత్తంగా 23 లక్షల ఎకరాలకు స్థిరీకరణ మరియు 7,20,000 ఎకరాలకు సాగునీరు అందుతుందని, అంతేకాకుండా 960 మెగావాట్ల హైడ్రో ఎలక్ట్రిసిటీ ఉత్పత్తి చేయడానికి అవకాశం ఉంటుందని, ఈ ప్రాజెక్టు పూర్తయితే కరెంట్ యూనిట్ 10 నుండి 15 పైసలకే తయారు చేయవచ్చని , కృష్ణ వాటర్ మన రాయలసీమకు అందుతుందని, ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. గత ప్రభుత్వంలో రాష్ట్రం ఎన్నో సమస్యలు ఎదుర్కొందని, వాటన్నింటినీ కూటమి ప్రభుత్వం సమర్ధంగా సరిచేసి, పాలనను గాడిలో పెట్టి, సుపరిపాలన అందించే విధంగా చంద్రబాబు నాయుడు ఉమ్మడి ప్రభుత్వం ఉంటుందని, ఈ సందర్భంగా ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి మాట్లాడుతూ కీలపట్ల దేవస్థానం టిటిడి పరిధిలో తేవడానికి కిరణ్ కుమార్ రెడ్డి పాత్ర ఎంతో ఉందని, ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కీలపట్ల దేవస్థానాన్ని టిడిపి పరిధిలో తేవడం జరిగిందని, ఈరోజు కీలపట్ల దేవస్థానం ఎంత అభివృద్ధి అయిందో మనమందరం చూస్తూనే ఉన్నామని,ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజల తరపున ఆయనకు ధన్యవాదాలను అమర్నాథ్ రెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా కీలపట్లకు వెళ్లడానికి దారి సింగిల్ రోడ్డు గా ఉందని, దాన్ని డబుల్ రోడ్డు చేస్తే ఇంత ప్రాచీనమైన గుడి మరింత అభివృద్ధి చెందుతుంది అని విలేకరులు ప్రస్తావించగా.. ఖచ్చితంగా ఆ రోడ్డు వెడల్పు చేసే అంశాన్ని ప్రయత్నం చేస్తామని ఈ సందర్భంగా అమరనాథ రెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఆర్.వి. బాలాజీ,రామచంద్ర నాయుడు, ఆర్బిసి కుట్టి, గిరి, ఖాజా పీర్, సోమశేఖర్ గౌడ్, విజయభాస్కర్ రెడ్డి,బిజెపి నాయకులు విజయ్, శరవణ, జనసేన నాయకులు దిలీప్,పూల చైతు, నాగరాజు, చందు, శివ మరియు తెలుగుదేశం పార్టీ , జనసేన పార్టీ బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులతో ముందుకు దూసుకు వెళ్తున్న ఎమ్మెల్యే నానిపై

చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి బురద చల్లడం దుర్మార్గం

- తిరుపతి రూరల్, చంద్రగిరి మండల అధ్యక్షులు

విశాలాంధ్ర – చంద్రగిరి: మాజీ శాసనసభ్యులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పదవి కాలంలో చంద్రగిరి ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని తమ నాయకుడు చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని గెలిచిన నెల రోజులకే అభివృద్ధి పథంలో నడిపిస్తుండడాన్ని చూసి ఓర్వలేక చెవిరెడ్డి నిరాధార ఆరోపణలు చేయడంతో టిడిపి తిరుపతి రూరల్ మండలాధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, చంద్రగిరి మండల అధ్యక్షులు సుబ్రహ్మణ్యం నాయుడు లు ఖండించారు. ఆదివారం చంద్రగిరి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో వారు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అదికారులతో వసూళ్ళు మాపని కాదు మీ అవినీతిపై మావద్ద సమగ్ర ఆధారాలు వున్నాయని ఆరోపించారు. అధికారులతో వసూళ్ళను పాల్పడటం మాపని కాదంటూ వారు దుయ్యబట్టారు. చంద్రగిరి నియోజకవర్గంలోని 6 మండలలాలకు సంబంధించి తహశీల్దార్ల బదిలీలలో ముడుపులు చేతులు మారినట్లు మాజీ ఎంఎల్ఏ చెవిరెడ్డి బాస్కర్ రెడ్డి నిరాధార ఆరోపణలు చేయడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. టిడిపి అధికారం చేపట్టి కేవలం రెండు నెలలే అవుతుందన్నారు. ఈ రెండు నెలల్లో ఎంఎల్ఏ పులివర్తి నాని ప్రజాహిత అభివృద్ధి కార్యక్రమాలతో ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. గత 5 ఏళ్ళ కాలంలో ఎంఎల్ఏగా మీరు చేసిన అవినీతి, అక్రమాలపై మా వద్ద సమగ్ర ఆధారాలు వున్నాయనీ, మీరు ఎక్కడికి తీసుకురమ్మన్నా తీసుకువస్తామంటూ సవాల్ విసిరారు. ఆ విధంగా సముపార్జించిన అవినీతి సొమ్ములతో ప్రజలకు గోడ గడియారాలు, కుక్కర్లు పంచినా ప్రజలు ఓడించారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు పాలనలో మా నాయకుడు పులివర్తి నాని నాయకత్వంలో పనిచేయడానికి అనేక మంది అధికారులు ఆసక్తిని కనబరుస్తూ వినతులు అందజేసినట్లు తెలిపారు. అయితే అధికారులను బ్లాక్ మెయిల్ చేస్తూ నోటీసులు పంపడం సమంజసం కాదన్నారు. గత 5 ఏళ్ళలో మీరు నియమించుకున్న ఆదికారులతో మండల పరిషత్, రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు ఇలా అన్ని విభాగాలలో ఇష్టారాజ్యంగా అక్రమాలు చేయించి, వసూళ్ళు చేసింది వాస్తవం కాదా అంటూ ప్రశ్నించారు. తుడాలో వందల కోట్ల అవినీతికి పాల్పడటం నిజం కాదా అంటూ నిలదీశారు. సమర్థులైన అధికారులు అభివృద్ధి కోసం ఎంఎల్ఏతో కలసి పనిచేయడానికి వస్తున్నారని అన్నారు. మాజీ ఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి మాటలు నమ్ముకుని వైసిపి కార్యకర్తలు శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నాలు మానుకుని, మన నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు గౌస భాషా, మండల ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్, తుడా మాజీ డైరెక్టర్ ఏజీ పల్లి బాల, టిడిపి యూత్ మండల అధ్యక్షుడు రాజులగారి వినోద్ కుమార్ రెడ్డి, సక్కూరి దనంజయ రెడ్డి, విసురిపాటి కంకర్, రాజులగారి అనిల్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరి అమ్మవారి ఉత్సవాలు

-పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి

విశాలాంధ్ర - గంగవరం : మండలంలోని శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారి ఆలయ జయంతి ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాలకు పలమనేరు శాసనసభ్యులు అమర్నాథ్ రెడ్డి చిత్తూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సిఆర్ రాజన్‌లు హాజర య్యారు. ఈ సందర్భంగా జరిగిన పూజా కార్యక్రమాలలో వారు పాల్గొని అమ్మవారిని వేడుకున్నారు. ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు వారిని ఘనంగా స్వాగతం తెలియజేయ డంతో పాటు పూజల అనంతరం ఘనంగా సన్మానించి తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి మాట్లాడుతూ ఆ అమ్మవారి చల్లని చూపు ప్రజలందరిపై ఉండాలని, సకాలంలో వర్షాలు విరివిగా కురిసి పంటలు బాగా పండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో అన్ని రంగాలలో రాణించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో పలమనేరు పట్టణ నాయకులు ఆర్వీ బాలాజీ, ఆర్.బి.సి కుట్టి, గిరిబాబు,లోకేష్, వెంకట్రమణ, సుదర్శన్, విజయ్, మురళి, మోహన్ ఉన్నారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ వి.కోట గ్రేటర్ అధ్యక్షులుగా ఆర్. ధీరజ్

విశాలాంధ్ర - వి.కోట: లయన్స్ క్లబ్ ఆఫ్ వెంకటగిరి కోట గ్రేటర్ నూతన కార్య వర్గాన్ని ఆదివారం లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కె. బాలకృష్ణ అధ్యక్షతన ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏడాది కాలం పాటు కొనసాగే పాలకవర్గంలో రెండవ అధ్యక్షులుగా డా. కె. తమీం ఖాన్, కార్యదర్శిగా కె. ఆర్. మురుగేష్, కోశాధికారి గా లక్ష్మణ్ చౌదరిలను ఎన్నుకున్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఏర్పాటు చేసిన నాటి నుంచి చేసిన సేవా కార్యక్రమాలను తెలియజేస్తూ భవిష్యత్తులో చేపట్టాల్సిన సామాజిక కార్యక్రమాల గురించి చర్చించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి సభ్యులందరూ సహకరించి మరెన్నో సేవా కార్యక్రమాలు చేసేందుకు ముందుకు సాగాలన్నారు. ఇదే కార్యక్రమంలో భాగంగా స్థానిక బాలుర ఉన్నత పాఠశాల కు సుమారు రూ, నలభై వేలు విలువ చేసే వంట పాత్రలు లయన్స్ క్లబ్ ఆఫ్ వి. కోట గ్రేటర్ చే అందజేశారు. పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కె. భక్తవత్సలం రెడ్డి, పిఎస్టి ఫోరం కో. ఆర్డినేటర్ జి. అరుణ్ కుమార్, ఏడిసిటి కె. రాజా రెడ్డి, రీజియన్ ఛైర్ పర్సన్ బి. గోపి కృష్ణ, జోన్ ఛైర్ పర్సన్ ఎన్. లోకేష్ లు జిఎంటి, సభ్యుల తో పాటు గత పాలక వర్గం సభ్యులు, సభ్యులు పాల్గొన్నారు.

మహిళలకు చీరలు పంపిణీ

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు పట్టణంలోని బాలాజీ నగర్ లోని ప్రగతి సేవా సంస్థ కార్యాలయం నందు ఇలగనూరు సుబ్బరత్నమ్మ వర్ధంతి సందర్భంగా వారి భర్త చెంచయ్య కుమారుడు రమణయ్య సహకారంతో 50 మంది నిరుపేద మహిళలకు చీరలు, వెజిటేబుల్ బిర్యాని పంపిణీ చేయడం జరిగింది. సంఘసేవలో విశేష సేవలకు గుర్తింపుగా హెూప్ థియలాజికల్ యూనివర్సిటీ వారు ప్రగతి కుటుంబ సభ్యుడు ఇనుగుంట రమేష్ కి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రగతి సేవ సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ కుటుంబ సభ్యులు ఘనంగా సత్కరిం చారు. శాలువా పూలమాలలతో మెమెంటోతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు మెడనూరు సురేష్ రెడ్డి, వాచ్ షాపు రాము, నక్కు రామకృష్ణ, కోట వెంకటేశ్వర్లు, కరస్పాండెంట్ శివకుమార్ రెడ్డి, పోతిరెడ్డి పెంచలయ్య, నాగరాజు, సంచి ముని ప్రసాద్, నరేష్, నాగేంద్ర ,వాకాటి శ్రీను, తుపిలి జస్వంత్, కిషోర్ పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

విశాలాంధ్ర - పుత్తూరు టౌన్ : పుత్తూరు పట్టణంలోని హిమజ స్కూల్ సమీపంలో కార్వేటినగరం రోడ్డులో సరికొత్త టెక్నాలజీతో శ్రీ లక్ష్మి స్కాన్ సెంటర్ ను ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ సోమవారం ముఖ్య అతిధిగా హాజరై ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలోజనసేననియోజకవర్గం అతిధిగా ఇంచార్జి మెరుపుల మహేష్ పాల్గొంటారని శ్రీలక్ష్మి స్కాన్ సెంటర్ నిర్వాహకులు తెలిపారు.

అభివృద్దే ప్రధాన అజెండా:పులివర్తి నాని

- గ్రామాల ప్రగతికి కృషి - నీటి ప్రాజెక్టులకు ప్రణాళిక సిద్ధం చేయండి
- సమిష్టి కృషితో ప్రజలకు మంచి చేద్దాం - మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే

విశాలాంధ్ర-యర్రావారిపాళ్యం: అభివృద్దే ప్రధాన అజెండాగా పనిచేద్దామని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పిలుపునిచ్చారు. ఆదివారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ముందుగా అధికారులు శాఖల వారీగా అజెండాలను వివరించారు. ఆ తర్వాత ఎమ్మెల్యే మాట్లాడుతూ సమిష్టి కృషితో గ్రామాభివృద్ధికి అడుగులు వేద్దామని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. తాగు, సాగునీటి ప్రాజెక్టులకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు. తలకోన, వలస పల్లి వంక, రెడ్డి చెరువు - చిన్నగొట్టిగల్లు చెరువుల అనుసంధాన కాలువ బలోపేతానికి చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలని, ఆ తర్వాత అభివృద్ధి పైనే తమ దృష్టి అని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. పూర్తి పారదర్శకంగా అభివృద్ధి పనులు చేపట్టేందుకు అధికారులు చొరవ చూపాలని ఆదేశించారు.

రెండు మోటర్ సైకిల్ ఢీ : ముగ్గురికి తీవ్రగాయాలు

విశాలాంధ్ర- దొరవారి సత్రం: మండల పరిధిలోని ఓవర్ బ్రిడ్జి సమీపంలోని దాబా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలుఅయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు దొరవారిసత్రం మండల చందనమూడి గ్రామానికి కృష్ణయ్య, తేజవతిలు నాయుడుపేట నుండి ఇంటికి తిరిగి వస్తుండగా అక్కరపాక గ్రామానికి చెందిన మన్నేలి శశిధర్ మోటర్ సైకిల వెళ్తూ ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో శశిధర్, కృష్ణయ్య, తేజవతికి గాయాలు అయ్యాయి. .వీరిని చికిత్స నిమిత్తం నాయుపేట ప్రభుత్వ ఆసుప్రతికి తరలించారు. శశిధర్‌కు తీవ్రగాయాలు కావడంతో మెరుగైన చికిత్స కొరకు నెల్లూరులోని ప్రభుత్వ ఆసుప్రతికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోటేశ్వర బాబుకు పలువురు అభినందనలు

విశాలాంధ్ర- తిరుపతి: ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ తమిళనాడు నుండి ఇటీవల గౌరవ డాక్టరేట్ పురస్కారం అందుకున్న కోటేశ్వర బాబును ఆదివారం పలువురు అభినందించారు. అన్నమయ్య జిల్లా రెవెన్యూ శాఖ లో పనిచేస్తున్న రెవెన్యూ అధికారి మధుసూదన్ రావు, విశాలాంధ్ర బ్యూరో ఇంచార్జ్ డాక్టర్ ప్రసాద్, వై చిన్న రెడ్డి తదితరులు దుశ్శాలువతో సత్కరించారు. కరోనా సమయంలో కోటేశ్వర బాబు చేసిన సేవలను కొనియాడారు. సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటున్న కోటేశ్వర బాబు మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలవూరు ఉద్యోగులు జర్నలిస్టులు కోటేశ్వర బాబు అభినందించిన వారిలో ఉన్నారు.

నేటి ర్యాలీని జయప్రదం చేయండి

- భవన నిర్మాణ వ్యవస్థాపకులు పుట్టా శంకరయ్య

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు పట్టణంలో భవన నిర్మాణ కార్మికులు సమస్యల పరిష్కారానికై సోమవారం భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయం వద్ద నుండి ఉదయం పది గంటలకు భారీ ర్యాలీ ప్రదర్శన ను జయప్రదం చేయాలని భవన నిర్మాణ వ్యవస్థాపకులు పుట్టా శంకరయ్య పిలుపు నివ్వడం జరిగింది. మన రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఇసుకను ఉచితంగా ఇస్తామని అని చెప్పి అధికారం లోకి వచ్చి రెండు నెలలు గడుస్తున్నా ఇసుకను అందుబాటులోకి ఉంచక పోవడాన్ని నిరసిస్తూ అలాగే సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరారు. జీవో నెంబర్ 12, 14 రద్దుచేసి, పెండింగ్ లో ఉన్న క్లయిమ్ లు పునరుద్ధరించాలని పేర్కొన్నారు. అర్హులైన వారందరికీ సంక్షేమ బోర్డులో రిజిస్టర్ చేయాలని, గత ప్రభుత్వం సంక్షేమ బోర్డు నుండి ఇతర పథకాలకు వాడుకున్న నిధులను వెంటనే జమ చేయాలని నిరసిస్తూ గూడూరు పట్టణ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగే భారీ ర్యాలీ ప్రదర్శనను ప్రజలు, కార్మికులు, సానుభూతిపరులు,అభిమానులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునివ్వడం జరిగింది.

పరిసరాలతోనే పరిశుభ్రత

మొక్కల సంరక్షణతోనే పర్యావరణ పరిరక్షణ

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి: యంగ్ ఎంప్లాయిస్ సోషల్ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సేవా సంస్థ అధ్యక్షులు హేమ్ కుమార్ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తిలోని సబ్ జైల్ పరిసర ప్రాంతాలను శుభ్రపరిచి మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీ కాళహస్తి సబ్ జైల్,జైలర్ శ్రీకాంత్ పాల్గొని మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు, ఈ సందర్భంగా సబ్ జైలర్ శ్రీకాంత్ మరియు ఎస్ సంస్థ సభ్యులు మాట్లాడుతూ..ఎస్ సేవా సంస్థ ఆధ్వర్యంలో నేడు శ్రీకాళహస్తిలోని సబ్ జైలు పరిసర ప్రాంతాలను శుభ్రపరచి మొక్కలు నాటి, వాటి రక్షణను కూడా తామే బాధ్యత వహిస్తామన్న ఎస్ సంస్థ అధ్యక్షులు హేమ్ కుమార్ మరియు సభ్యులకు జైలర్ శ్రీకాంత్ అభినందనలు తెలియజేశారు, ఎస్ సేవాసంస్థ అనుమతిస్తే వాళ్ళు సేవా కార్యక్రమంలో పాల్గొంటానని తెలియజేశారు ఎస్ సేవా సంస్థ సభ్యులు మాట్లాడుతూ..ఎస్ సంస్థ 16 సంవత్సరాలుగా విద్య, వైద్య, మౌలిక వసతులను ప్రజలకు అందించే విధంగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని, ఈ సేవా కార్యక్రమాల్లో భాగంగా సబ్ జైలు నందు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించామని, జనజీవన స్రవంతిలో నేడు అనేకమంది ఆక్సిజన్ లేకుండా కరోనా సమయంలో మృతి చెందారని, కాబట్టి ప్రతి ఒక్కరు వారు ఎటువంటి వేడుకలు నిర్వహించుకున్న ఒక్కొక్క మొక్కను నాటి పర్యావరణాన్ని రక్షించవలసిందిగా కోరారు, నేడు ప్రభుత్వం కూడా స్వచ్ఛభారత్ కార్యక్రమాలు పేరిట మొక్కలు నాటే కార్యక్రమం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుంది కాబట్టి ప్రభుత్వ ఆదేశాలనుసారం ప్రతి ఒక్కరు పర్యావరణాన్ని రక్షించవలసిందిగా ఆయన కోరారు. సభ్యులు కాంగ్రెస్, శ్రీనివాసులు, సురేష్, రాజశేఖర్, రమణ, నారాయణ, ప్రదీప్ కుమార్, అంజయ్య, శ్రీనివాసులు సబ్ జైలు సిబ్బంది శ్రీనివాసరావు , వెంకటరావు, వార్డెన్స్ క్రాంతి , భాస్కర్ , హెూమ్ గార్డ్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

దామలచెరువు రామాలయంలో చోరీ



విశాలాంధ్ర- పాకాల: పాకాల మండలంలోని దామలచెరువు కోదండ రామాలయంలో చోరీ జరిగింది. శని వారం అర్ధరాత్రి దొంగలు ఆలయంలోకి ప్రవేశించి హుండీ పగలగొట్టి అందులోని సొమ్మును తీసుకెళ్లారు ఉదయం ఈ విషయాన్ని గుర్తించిన స్థానికులు పాకాల పోలీసులకు సమాచారం అందించారు . ఎస్సై మహేష్ బాబు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు పట్టాలు నడిబొడ్డులో ఉన్న ఆలయంలో చోరీ జరగడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఘటనపై ఎస్సై మహేష్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గూడూరులో కార్డెన్ సెర్చ్

విశాలాంధ్ర - గూడూరు : శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పలు అనుమానిత ప్రాంతాల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని కొత్త వ్యక్తులు సంచరిస్తుంటే పోలీసులకు, ప్రజలు సమాచారం అందించాలని గూడూరు డిఎస్పి సూర్యనారాయణ రెడ్డి కోరారు. గూడూరు పట్టణం లోని అరుంధతియ వాడలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 11 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా గూడూరు డిఎస్పీ సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు. గంజాయి అమ్మకాలపై ప్రత్యేక నిఘా ఉంచామని, రెండు కేసులు కన్నా ఎక్కువ నమోదైతే వారిపై పిడి యాక్ట్ నమోదు చేస్తామని వెల్లడించారు. అనుమానిత ప్రాంతాలపై ప్రత్యేకంగా ఉంచామని చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని అన్నారు. కార్డన్ సెర్చ్ లో సిఐలు ,ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ చౌడేశ్వరి దేవి జయంతి వేడుకలు

విశాలాంధ్ర - పుంగనూరు: పుంగనూరు మండలం చదళ్ళ గ్రామంలో వెలసిన శ్రీశ్రీశ్రీ సప్తమాతృక సమేత శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయం నందు శ్రీ చౌడేశ్వరి దేవి జయంతి వేడుకలను, చౌడేశ్వరి దేవి ట్రస్ట్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది. గణపతి హెూమంతో ప్రారంభించి సుబ్రమణ్య హెూమం, నవగ్రహ హెూమం,మృత్యుంజయ హెూమం,చౌడేశ్వరి హెూమం, పూర్ణాహుతి చేయడం జరిగింది. ఈ పూజా కార్యక్రమంలో చదల్ల గ్రామ ప్రజలే కాకుండా,చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు చాలామంది భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు అయ్యారు. అమ్మవారికి విశేష అలంకరణతో పాటు ఆలయాన్ని కూడా పూలతో విశేషంగా అలంకరణ చేయడం జరిగింది. ఈ పూజా కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు ఎన్ వేణు గోపాల్ రెడ్డి, ఆలయ ప్రధాన కార్యదర్శి శివ కుమార్ రెడ్డి, నరేంద్ర రెడ్డి, నారాయణ రెడ్డి, వెంకట రమణ రెడ్డి, జయపాల రెడ్డి, శంకర్ రెడ్డి, వెంకట రెడ్డి,చంద్ర మోహన్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, చిట్టి తదితర ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆగస్టులో రెండు సార్లు
గరుడ వాహనంపై విహరించనున్న శ్రీ మలయప్ప స్వామి

విశాలాంధ్ర - తిరుమల కల్చరల్ : తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారికి ఆగస్టు నెలలో రెండు సార్లు గరుడవాహనసేవ జరుగనుంది. ఆగస్టు 9వ తేదీ గరుడ పంచమి, ఆగస్టు 19వ తేదీ శ్రావణ పౌర్ణమి పర్వదినాల సందర్భంగా శ్రీమలయప్పస్వామివారు గరుడవాహనంపై నాలుగు మాడ వీధులలో విహరించి భక్తులను కటాక్షించనున్నారు. ఆగస్టు 9న గరుడ పంచమి ఆగస్టు 9వ తేదీ గరుడ పంచమి పర్వదినాన్ని పురస్కరించుకొని తిరుమలలో శ్రీ మలయప్పస్వామివారు రాత్రి 7 నుండి 9 గంటల వరకు తమ ఇష్టవాహనమైన గరుడునిపై తిరుమాడ వీధులలో ఊరేగి భక్తులను అనుగ్రహించనున్నారు. శ్రీవారి వాహనాల్లోను, సేవకుల్లోను అగ్రగణ్యుడు గరుత్మంతుడు. ప్రతి ఏడాది గరుడ పంచమిని శుక్ల పక్షమి ఐదవ రోజు ఘనంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా "గరుడపంచమి" పూజను నూతన దంపతులు తమ వైవాహిక జీవితం ఆనందదాయకంగా వుండేందుకు, స్త్రీలు తమకు పుట్టే సంతానం గరుడునిలాగా బలశాలిగా, మంచి వ్యక్తిత్వం గలవాడిగా ఉండేందుకు పూజిస్తారని ప్రాశస్త్యం.ఆగస్టు 19న శ్రావణ పౌర్ణమి ప్రతి నెల పౌర్ణమి సందర్భంగా తిరుమలలో నిర్వహించే పౌర్ణమి గరుడసేవను ఆగస్టు 19వ తేదీ శ్రావణ పౌర్ణమినాడు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా రాత్రి 7 నుండి 9 గంటల వరకు శ్రీవారు గరుడునిపై ఆలయ నాలుగు వీధులలో విహరించి భక్తులకు దర్శనమివ్వనున్నారు.

తడలో ఘనంగా టిడిపి విజయోత్సవ ర్యాలీ

విశాలాంధ్ర - తడ : తడలో ఆదివారం తెలుగుదేశం పార్టీ విజయోత్సవ ర్యాలీ ఆత్మీయ సభ ఘనంగా నిర్వహించారు, తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి మురళి రెడ్డి సారధ్యం లో పెద్ద సంఖ్యలో,నాయకులు కార్యకర్తలు విజయోత్సవ ర్యాలీ చేపట్టారు తడ కండ్రిగ లోని చెంగాలమ్మ లే అవుట్ నుండి ర్యాలీగా తడ రైల్వే స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సభ వరకు ర్యాలీగా నెలవల విజయశ్రీ ప్రజలకు అభివాదం చేస్తూ కృతజ్ఞతలు తెలియజేశారు. సభా ప్రాంగణంలో ఆమెను నాయకులు, కార్యకర్తలు గజమాలలు వేసి సత్కరించారు .ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి అభ్యర్థిగా సూళ్లూరుపేట శాసనసభ్యురాలుగా ఎన్నుకున్న ఈ నియోజకవర్గ ప్రజలకు పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుకుంటున్నానని సూళ్లూరుపేట నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడిపించేందుకు తమ అందరి సహాయ సహకారాలతో అభివృద్ధి చేసి చూపిస్తానని అన్నారు కార్యకర్తలు అందరూ కలిసి ఉంటేనే బలం అని అందరం కలిసికట్టుగా నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు నాయకత్వం అంటేనే అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళు లా అన్ని రంగాలలో అభివృద్ధి పరిచే నాయకత్వ లక్షణాలు కలిగిన వ్యక్తిని ఆమె కొనియాడారు. సూపర్ సిక్స్ పథకాలలో ఇచ్చిన మేనిఫెస్టో ప్రకారం వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేస్తున్నామని ఆగస్ట్ 15 నుండి అన్నా క్యాంటన్‌లు, తల్లికి వందనం, ఉచిత బస్ ప్రయాణం ముఖ్యమంత్రి ప్రారంభించ నున్నారని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా యూత్ ఉపాధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి నియోజకవర్గం యూత్ ప్రెసిడెంట్ రవి రెడ్డి, నడమ మండల జనరల్ సెక్రెటరీ నీలకంఠం, శివాజీ రాజారెడ్డి ఎక్స్ ఎంపిటిసి రామకృష్ణ, రమేష్, గుణసుందరి, రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

జనజీవన గీతం జానపదం

విశాలాంధ్ర-యర్రావారిపాళ్యం: జనజీవన గీతం మన జానపదం అని తిరుపతి జిల్లా మనసంస్కృతి కళా సంస్థ ప్రధాన కార్యదర్శి రెడ్డప్ప అన్నారు. ఆదివారం మండలంలోని నెరబైలు పంచాయతీలో శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద జానపద కళారూప భక్తి పాటలు, పల్లె పాటలను కళాకారులు ఆలపించారు.ఈ కార్యక్రమంలో డి.వెంకట రమణ, డి. నాగరజమ్మ గురువులు, కళాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కళాకారులని పెద్దలు సత్కరించారు.

చంద్రగిరి తాసిల్దారుగా శివరామ సుబ్బయ్య

విశాలాంధ్ర - చంద్రగిరి: చంద్రగిరి తహసీల్దారుగా శివరామ సుబ్బయ్య ఆదివారం బాధ్యతలు చేపట్టారు. రెవెన్యూ కార్యాలయ సిబ్బంది తహసీల్దార్ శివరామ సుబ్బయ్యకు పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ మండలంలోని భూ సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పారదర్శకంగా పరిష్కరిస్తామన్నారు. రెవెన్యూ సిబ్బంది ప్రజల నుంచి వచ్చే సమస్యలపై సానుకూలంగా స్పందించి ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించడమే ధ్యేయంగా విధులు నిర్వహించాలన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

విశాలాంధ్ర-యర్రావారిపాళ్యం: తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం అని ఐసిడిఎస్ సూపర్వైజర్ భారతి అన్నారు. ఆదివారం తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. తల్లిపాల వారోత్సవాలు అవగాహన కార్యక్రమాల్లో భాగంగా ఈడిగ పల్లెలోని అంగన్వాడీ కేంద్రంలో ఈ కార్యక్రమం జరిగింది. ఏఐటిసి జిల్లా కార్యదర్శి నాగరాజమ్మ, ఏఎన్ఎం సరస్వతి, పాఠశాల హెచ్ఎం పుష్ప, అంగన్వాడి వర్కర్లు పాల్గొన్నారు

పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

విశాలాంధ్ర -చిత్తూరు : నగరంలోని టాప్ లైన్ లో పేకాట స్థావరం పై దాడి చేసి ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు చిత్తూర్ వన్ టౌన్ పోలీసులు తెలిపారు. నగరం టాప్ లైన్ లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 13,180 రూపాయలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

తల్లిపాలే బిడ్డకు శ్రీ రామరక్ష : డాక్టర్ తనుజ

విశాలాంధ్ర - గూడూరు : పుట్టిన బిడ్డకు మొదటి ఆరు నెలలు క్రమం తప్పకుండా తల్లిపాలు అందిస్తే ఆ బిడ్డ ఆరోగ్య వంతంగా ఉంటుందని ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు ప్రముఖ వైద్యురాలు డాక్టర్ తనుజ తెలిపారు. గూడూరు పట్టణంలోని సరస్వతి శిశు మందిరంలో నిర్వహించిన ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు తల్లిపాల యొక్క ప్రాముఖ్యతను బాలింతలకు తెలియజేశారు. అనంతరం పౌష్టిక ఆహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు, ప్రముఖ వైద్యురాలు డాక్టర్ తనుజ మాట్లాడుతూ తల్లిపాల యొక్క ఆవశ్యకతను మరియు ప్రాముఖ్యతను తెలియ జేస్తూ ప్రపంచవ్యాప్తంగా ఆగస్టు నెల మొదటి వారం వారం రోజులపాటు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర మహిళా మండలి సభ్యులు బాలింతలు గర్భవతులు తదితరులు పాల్గొన్నారు .

440 వ నేత్రదాతగా కాకు వెంకటరత్నం రెడ్డి

విశాలాంధ్ర-తడ : సూళ్లూరు పేటకు చెందిన ఆచార్య భరద్వాజ సేవా సంస్థ వారిచే నిర్వహిస్తున్న నేత్రదాన దాతగా తడ మండలం మాంబట్టు గ్రామ వాస్తవ్యులు కాకు వెంకట రత్నం రెడ్డి 440వ నేత్రదాతగా నిలిచారు.మాం బట్టు గ్రామ వాస్తవ్యులైన వెంకటరత్నం ఆదివారం మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యుల అంగీకారంతో చెన్నై శంకర్ నేత్రాలయ వారికి ఆచార్య భరద్వాజ సేవాసంస్థ వారి ఆధ్వర్యం లో నిర్వహించే నేత్రదాన మహెూద్యమం లో నేత్రాలను దానం చేసి 440 వ నేత్రదాతగా నిలిచారు .వెంకట రత్నం గారు మరణించినా నేత్రదానం చేసి ఇద్దరు శరీరాల లో జీవించే వుంటారని ఆచార్య భరద్వాజ సంస్థ నిర్వాహకులు శ్రీనివాసులు తెలిపారు

వయోవృద్ధుల దర్శనంపై పుకార్లను నమ్మొద్దు: టీటీడీ

విశాలాంధ్ర-తిరుమల కల్చరల్: వయోవృద్ధుల దర్శనానికి సంబంధించి తప్పుదోవ పట్టించే కొన్ని వార్తలు సోషల్ మీడియాలో గత కొంతకాలంగా చక్కర్లు కొడుతున్నాయి. ఇవి పూర్తిగా అవాస్తవం. వాస్తవం ఏమిటంటే, ప్రతిరోజు 1000 మంది వయోవృద్ధులు, దివ్యాంగుల కోసం టిటిడి ప్రతి నెల 23 మధ్యాహ్నం 3 గంటలకు మూడు నెలల ముందుగానే ఆన్‌లైన్ కోటాను విడుదల చేస్తోంది. టికెట్ పొందిన వ్యక్తికి రూ. 50/- ఒక లడ్డూ ఉచితంగా లభిస్తుంది. తిరుమలలోని తిరుమల నంబి ఆలయానికి ఆనుకుని ఉన్న సీనియర్ సిటిజన్/పిహెచ్‌సి లైన్ ద్వారా ప్రతిరోజూ మధ్యాహ్నం 3 గంటలకు శ్రీవారి దర్శనానికి అనుమతిస్తారు. కావున సోషల్ మీడియా లో ప్రచారం అవుతున్న ఇలాంటి తప్పుడు వార్తలు లేదా వదంతులను నమ్మవద్దని టీటీడీ భక్తులకు మరోమారు విజ్ఞప్తి చేస్తున్నది. భక్తులు సరైన సమాచారానికి టీటీడీ అధికారిక వెబ్‌సైట్ www.tirumala.org, https://ttdevastanams.ap.in ను మాత్రమే సంప్రదించగలరు.

బోడిరెడ్డి దొరస్వామి రెడ్డి మృతి బాధాకరం

విశాలాంధ్ర-చంద్రగిరి: చంద్రగిరి మండలం, దోర్నగంబాల పంచాయతీ, మండపం పల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ వీరాభిమాని మాజీ ఎమ్మెల్యే నారా రామూర్తి నాయుడుతో కలిసి నడిచిన బోడిరెడ్డి దొరస్వామిరెడ్డి గత నెల 11వ తేదీన మృతి చెందారు. నాని అందుబాటులో లేని కారణంగా దహన క్రియలు మరియు కర్మ క్రియలకు రాలేకపోయారు. ఆదివారం ఉదయం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని నాయకులతో కలిసి దొరస్వామి రెడ్డి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను మాట్లాడి నేనున్నానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పనబాకం పంచాయతీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

విశాలాంధ్ర - చంద్రగిరి: చంద్రగిరి మండలం, పనబాకం పంచాయతీ సత్తెమ్మ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు చంద్రగిరిలో పులివర్తి నానిని మర్యాదపూర్వకంగా కలిశారు. పనబాకం పంచాయతీకి చెందిన అండర్ డ్రైనేజ్, రోడ్డు మరమ్మత్తులు, పనబాకం రైల్వే స్టేషన్ కు చెందిన పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సత్తెమ్మ వెల్ఫేర్ అసోసియేషన్ అర్జీ దారులతోపాటు మండల పార్టీ నాయకుడు, కార్యకర్తలు ఉన్నారు.

అగాపే క్రీస్తు ప్రేమ మందిరం ప్రారంభోత్సం

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి: ఏర్పేడు మండలం, మేర్లపాక గ్రామంలో టిడిపి నాయకులు రమణ వెంకటస్వామి, గ్రామస్తులు నూతనంగా నిర్మించిన చర్చి అగాపే క్రీస్తు ప్రేమ మందిరంను రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి రెడ్డి వారి గురువారెడ్డి ఆదివారం ప్రారంభించారు. పలువురు గ్రామస్తులు, ఏసు భక్తుల ప్రత్యేక ప్రార్థనల మధ్య రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డి వారి గురువారెడ్డి పలువురు నాయకులతో కలిసి ఘనంగా పాస్టర్ అగాపే బ్రదర్ జాకబ్ సమక్షంలో రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం చేశారు. అనంతరం రెడ్డివారి గురువారెడ్డి మాట్లాడుతూ అత్యంత పవిత్రమైనటువంటి ఏసుప్రభు యొక్క దేవాలయమైన చర్చిని ప్రారంభించే అదృష్టం దొరకడం పూర్వజన్మ సుకృతం అన్నారు. సర్వ మతాలు సమానమని చెప్పారు. అనంతరం జరిగిన రమణ వెంకట్ స్వామి గ్రామస్తులు ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చర్చి పాస్టర్ పార్లమెంట్ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి కేకే రమణ, మేర్లపాక గ్రామ పార్టీ నాయకులు నరసింహనాయుడు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కృష్ణవేణి, మండల పార్టీ నాయకులు సదాశంకర్ వెంకటస్వామి పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

నారాయణవనంలో అట్టహాసంగా టిడిపి జెండా ఆవిష్కరణ

1, 2 వార్డులలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పర్యటన

విశాలాంధ్ర - పుత్తూరు టౌన్: నారాయణవనం మండల కేంద్రంలోని ఒకటి మరియు రెండవ వార్డులలో శాసనసభ్యులు కోనేటి ఆదిమూలం అట్టహాసంగా తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఆదివారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే కీళగరం మెట్ట పైన ఉన్న అమ్మవారి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడ నుండి టిడిపి శ్రేణులతో భారీ ర్యాలీగా ఆటో స్టాండ్‌కు చేరుకొని తెలుగుదేశం పార్టీజెండాని ఆవిష్కరించారు. అక్కడి నుంచి కోటవీధుల్లోని మాజీ ఎంపీపీ భక్తావత్సలం ఏర్పాటు చేసిన తెలుగుదేశం పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక టిడిపి నేతలు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం దుశ్శాలువ, భారీ గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సత్యవేడు నియోజకవర్గ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మాట్లాడుతూ సుదీర్ఘంగా నన్ను ఆదరిస్తున్న నాయకులను కార్యకర్తలను ఎన్నటికీ ఎప్పటికీ మర్చిపోలేని వారు కావాల్సిన అభివృద్ధి పథకంలో వారి ద్వారానే సేవలు అందిస్తానని తెలిపారు 1, 2 వార్డుల్లో మొదలి యార్ సంఘస్తులకి ఎనలేని సేవలో చేశారు ముఖ్యంగా అవనాంచమ్మ జాతర గొడవల్లో నేను ఎవరికి ఎలాంటి

ఇబ్బంది లేకుండా సుప్రీంకోర్టు దాకా వెళ్లిన నా మద్దిస్తాన్ని పరిష్కరించాను ఎవరికి ఎలాంటి గొడవలు లేకుండా జాతర సంతోషంగా జరుపుకుంటున్నారు. నా పైన చూపించిన అభిమానానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ మీకు సేవ చేయడానికి సంసిద్ధంగా ఉన్నానని ఆయన పేర్కొన్నారు. పార్టీలు అధికారాల్లో మారిన కొంతమంది సీనియర్ నాయకులు నా వెన్నంటు నడుస్తూ రాజకీయంలో నాతోపాటు కొంతమంది నన్ను అభిమానిస్తున్నారు వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా మన నియోజకవర్గంలో శ్రీ సిటీలో ఉద్యోగులు కానీ యువత యువకులకు కల్పిస్తానని తెలిపారు. అంతేకాకుండా నాకు ఓటు వేసిన వారందరికీ ధన్యవాదాలు తెలుపుతూ ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ఎన్ భాస్కరన్ (బోస్) మాజీ రాష్ట్ర నెట్ క్యాప్ చైర్మన్ ఆర్‌డి ఏకాంబరం, మాజీ ఎంపీపీ ఏపీ భక్తవత్సలం మాజీ ఎంపీపీ పి.గోవింద స్వామి సింగల్ విండో చైర్మన్ పి.ఊరప్ప, ఏపీ మోహన్ మొదలి, అచ్చట్ల హరి, బి ఎం నరేష్, వేల్ రెడ్డి, టి.సుబ్రహ్మణ్యం, కే.సుధా బాబు కందస్వామి నాయుడు శేఖర్ మాణిక్యం ముఖేష్ బాలు రమేష్ డ్రైవర్ మణి రెడ్డి యువరాజ్, అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంఘ సేవకుడికి సన్మానం

విశాలాంధ్ర- శ్రీకాళహస్తి: తన సేవా కార్యక్రమాల ద్వారా ఎంతోమంది పేదల హృదయాలలో చిరస్థాయిగా స్థానం సంపాదించుకున్న స్వచ్ఛంద సంఘ సేవకుడు యల్లంపాటి కోటేశ్వర బాబు కు శ్రీకాళహస్తి నియోజకవర్గ ముదిరాజ్ సంఘం గౌరవ అధ్యక్షులు పిల్లారి బత్తినయ్య సన్మానించారు. ఆయన చేసిన సమాజ సేవలకు గుర్తింపుగా ఇటీవల (ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ కోయంబత్తూరు) తమిళనాడు రాష్ట్రం నుండి గౌరవ డాక్టరేట్ పురస్కారం అందుకున్న సందర్భంగా ఆదివారం డాక్టర్ కోటేశ్వర బాబును ఆయన నివాసంలో పిల్లారి బత్తినయ్య కలిసి ఘనంగా సన్మానించారు. బత్తినయ్య మాట్లాడుతూ అటు సేవారంగంలోనూ ఇటు పత్రిక రంగంలోనూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకొని సేవే పరమావధిగా భావించి సేవలతోనే దైవాన్ని మెప్పించగలమని కరోనా కష్టకాలంలో తన ప్రాణాలను సైతం లెక్క చేయకుండా మూగజీవాలకు నిర్విరామంగా ఆహారాన్ని అందించి ఎందరికో ఆదర్శంగా నిలిచి ఆంధ్ర శ్రీ అవార్డు ను అందుకున్నారని అనంతరం శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని తొట్టంబేడు, ఏర్పేడు, శ్రీకాళహస్తి, మండలాల్లోని మారుమూల ప్రాంతాల్లో నిరుపేదలకు ఆటో కార్మికులకు తన వంతుగా సహాయ సహకారాలు అందించి ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలో చదివే వందలాదిమంది గిరిజన విద్యార్థిని విద్యార్థులకు విద్యా సామాగ్రిని అందజేసారని ఆయన నిరంతర సేవలకు గుర్తింపుగా నేడు గౌరవ డాక్టరేట్ పురస్కారం అందుకోవడం మన అందరికీ గర్వకారణమని నేటి యువత కోటేశ్వర బాబు ను ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థి దశ నుండే సేవా దృక్పథం అలవర్చుకోవాలనీ ఈ సందర్భంగా ఆయన కోటేశ్వర బాబు ను అభినందించారు.

ఎంపి వేమి రెడ్డికి ఘన సన్మానం

విశాలాంధ్ర-గూడూరు: ఆంధ్ర ప్రదేశ్ బ్రాహ్మణ సేవ సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి నీ ఘనంగా సన్మానించారు. అనంతరం వేద ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా ఎం.పి వేమి రెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ గూడూరు బ్రాహ్మణ సేవ సంఘాన్ని కొనియాడారు. అనంతరం ఎంపికి ధన్యవాదాలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఉపాధ్యక్షులు అని మెళ్ళ శివ కుమార్, కార్యదర్శి చిట్ట మూరు శ్రీనివాస రావు, కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, కడివేటి రామూర్తి, శ్రీనివాస్ కుమార్, నరసింహారావు, కమల కుమారి, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం

విశాలాంధ్ర-సూళ్లూరు పేట: లయన్స్ క్లబ్ ఆఫ్ సూళ్లూరుపేట షార్ వారి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక బస్టాండ్ వద్ద పేదలకు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. లయన్స్ క్లబ్ సభ్యులు ఈతకోట ఏడుకొండలు మనవడు ప్రణవ్ పుట్టిన రోజు సందర్భముగా చిన్నారి కుటుంబ సభ్యులంతా కలిసి ఈ అన్నదాన కార్యక్రమంలో పాల్గొని పేదలకు అన్నదానం చేశారు, లయన్స్ క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ ఆదిశేషారెడ్డి, అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, కార్యదర్శి రాధాకృష్ణ రావు, ట్రెజరర్ అప్పారావు సారథ్యంలో ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.

డ్రిప్ తుంపర్ల సేద్యం కోసం రైతులు నమోదు చేసుకోవాలి: ఉద్యానవన శాఖ

విశాలాంధ్ర-చిత్తూరు: డ్రిప్ తుంపర్ల సేద్యం కోసం రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఉద్యానవన శాఖ అధికారిని సంతోషి కుమారి తెలిపారు ప్రస్తుతం ప్రభుత్వం డ్రిప్ తుంపర్ల సేద్యం ను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాకు 25వేల హెక్టార్లను కేటాయించడం జరిగిందన్నారు పుంగనూరు నియోజకవర్గంలో చౌడేపల్లి నందు 39 50 రైతులకు సంబంధించి 5 వేల ఎకరాలు సోమలలో 7560 రైతులకు సంబంధించి 9850 ఎకరాలు సదుం నందు 6840 మంది రైతులు 8550 ఎకరాలు పులిచెర్లలో 8580 మంది రైతులు 15650 ఎకరాలు రొంపిచర్లలో 6280 మంది రైతులు 8550 ఎకరాలకు డ్రిప్పు తుంపర్ల సేద్యానికి మంజూరు చేశారన్నారు రైతులు తమ పాసుపుస్తకం ఆధార్ కార్డు తీసుకుని రైతు సేవా కేంద్రాల్లో పేర్లను నమోదు చేసుకోవాలని ఆమె కోరారు చిన్న సన్నకారు రైతులకు 90 శాతం పెద్ద రైతులకు 70 శాతం రాయితీతో ప్రభుత్వం పరికరాలు అందిస్తుందన్నారు ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని సంతోషి కుమారి కోరారు.

ఉచిత కంటి శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర - చిత్తూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలురు పాఠశాల ఆవరణంలో ఆదివారం ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 2.00 గంటల వరకు మహతి ఫౌండేషన్ ఛైర్మెన్ నాగరాజు సహకారంతో కుప్పం పి ఇ ఎస్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి లోపంతో బాధ పడే వృద్దులు పెద్ద సంఖ్యలో పాల్గొని, నెలకొన్న సమస్యను డాక్టర్లకు వివరించి, లోపాన్ని అధికమించే సూచనలు తెలుసుకొన్నారు. సమస్య తీవ్రంగా ఉన్నవారు చికిత్సలు నిర్వహించుకొని ఆపరేషన్ కొరకు ఎంపిక కావడం జరిగింది.ఈ సందర్భంగా డాక్టర్ చైతన్య మాట్లాడుతూ కంటి, దీర్ఘకాలిక వ్యాధులతో బాధ పడే రోగుకు పెద్ద సంఖ్యలో హాజరు కావడం జరిగింది.వీరు బ్రతుకు తెరువులో పడి ఆరోగ్యంపై ఆ శ్రద్ధ వహించడంతో చిన్న రోగాలను కూడ నయం చేసుకొనే పరిస్థితిని కూడ మరిచారు..ప్రజల కోసమే ఫౌండేషన్ పెట్టి ప్రతి నెల గ్రామాల్లో సమాచారాన్ని అందిస్తూ, కంటి ఆపరేషన్ లు చేసిన ఘనత ఒక్క ఫౌండేషన్ ఛైర్మన్ నాగరాజుకే దక్కునని తెలిపారు. విపత్తు సంభవించిన, ప్రకృతి కన్నెర్ర జేసిన, కరోనా కాటేసిన, ఎన్నో వడిదిడుకులు సంభవించిన శ్రీకారం చుట్టిన ప్రతి కార్యక్రమం దిగ్విజయంగా సాగుతున్నది.దీనికి కృషి చేస్తున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఛైర్మెన్.ప్రతి నెల పింఛన్ అర్హులకు ఎలా అందుతుందో...ప్రతి నెల మొదటి వారంలో వచ్చే ఆదివారం రోజు ప్రతి రోగి ఆరోగ్య చికిత్సలు చెసుకోవాలన్నదే ఛైర్మెన్ నాగరాజు సంకల్పం.. ఇదే దిశలోనే పలమనేరు,కుప్పం, పుంగనూరు నియోజవర్గాల్లో ఉన్నటువంటి వేల మంది వృద్దులకు,జనరల్ చకప్,కంటి ఆపరేషన్ చేసి , ఆరోగ్యంగా ఇంటికి పంపించే వరకు మహతిఫౌండేషన్ భరోసాగా నిలిచిన ఏకైక సంస్థగా పేరొందినది.

టి.జి.వెంకటేష్‌ను కలిసిన గూడూరు కిషోర్ కుమార్

విశాలాంధ్ర-నాయుడుపేట: రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు, మాజీ రాజ్యసభ సభ్యులు,మాజీ మంత్రి టీజీ వెంకటేష్, రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు చిన్న రామసుబ్బయ్య లను తిరుపతి రూరల్ జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షులుగా నియమితులైన గూడూరు కిషోర్ కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఆదివారం చిత్తూరు జిల్లా ఆర్యవైశ్యసంఘం అధ్యక్ష ప్రమాణస్వీకారోత్సవానికి విచ్చేసిన టీజీ వెంకటేష్, రాష్ట్ర ఆర్యవైశ్యసంఘం అధ్యక్షులు చిన్నరామసుబ్బయ్యలను తిరుపతి రూరల్ జిల్లా నూతన అధ్యక్షులు గూడూరు కిషోర్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా టీజీ వెంకటేష్, చిన్న రామసుబ్బయ్యలకు కిషోర్ కుమార్ శాలవాలు కప్పి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. తిరుపతి రూరల్ జిల్లా ఆర్యవైశ్యసంఘం అధ్యక్షులుగా తనను నియమించిన రాష్ట్ర ఆర్యవైశ్యసంఘం అధ్యక్షులు టీజీ వెంకటేష్, అధ్యక్షులు చిన్న రామసుబ్బయ్య, ఆర్యవైశ్యసంఘం నాయకులకు కిషోర్ కుమార్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఆర్యవైశ్యసంఘం నాయకులందరూ సహకారంతో తిరుపతి రూరల్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని కిషోర్ కుమార్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట, సూళ్లూరుపేట, వెంకటగిరి, పలు మండలాల ఆర్యవైశ్య సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బాలికల హాస్టల్‌లో పారిశుద్ధ్య పనులు

విశాలాంధ్ర-తొట్టంబేడు: తొట్టంబేడు మండలంలోని చెన్నై రోడ్డు మార్గమధ్యంలోని ధర్మరాజుల గుడి సమీపంలోని ప్రభుత్వ బాలికల హాస్టల్స్ లో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సూచనల మేరకు పంచాయతీ కార్యదర్శి అంకయ్య.. తొట్టంబేడు సర్పంచ్ సుబ్బయ్య ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు ఆదివారం ప్రారంభించారు. పారిశుద్ధ్య కార్మికులతో హాస్టల్స్ ఆవరణములోని డ్రైనేజీ కాలువలో పూడికతీత, చెత్తాచెదారం తొలగించి శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుబ్బయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే సహాయ, సహకారాలతో పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపిస్తామని తెలిపారు.

మంత్రి పార్థసారథికి ఘన సన్మానం

విశాలాంధ్ర-తిరుపతి: రాష్ట్ర సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి వర్యులు కొలుసు పార్థసారథికి ఆదివారం స్థానిక పద్మావతి అతిథి గృహం నందు స్థానిక ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు, తిరుపతి పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నరసింహ యాదవ్, రాయలసీమ మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, నగర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చిన్నబాబు, కార్పొరేటర్ ఆర్.సి. మునికృష్ణ, మాజీ అధ్యక్షులు దంపూరి భాస్కర్ మంత్రిని ఘనంగా సన్మానించారు.

కేంద్ర మంత్రి భూపతిరాజుకు జన్మదిన శుభాకాంక్షలు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి : కేంద్ర మంత్రివర్యులు భూపతి రాజు శ్రీనివాస వర్మ కు బిజెపి తిరుపతి జిల్లా అధ్యక్షులు డాక్టర్ చంద్రప్ప జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కేంద్రభారీ పరిశ్రమలు, ఉక్కు పరిశ్రమశాఖ సహాయ మంత్రివర్యులు భూపతి రాజు శ్రీనివాస వర్మ జన్మదిన సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల దర్శనార్థం విచ్చేశారు. వీరికి బిజెపి జిల్లా అధ్యక్షులు డాక్టర్ చంద్రప్ప, భారతీయ జనతా పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

హాస్టల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు రాజశేఖర్ సస్పెండ్

విశాలాంధ్ర-తిరుపతి: శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ హాస్టల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా ఎన్ఎంఆర్ గా పనిచేస్తున్న కె.రాజశేఖర్ ను సస్పెండ్ చేయడం జరిగిందని ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ తిరుపతి నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కేవై.రాజా ఎన్.డి.రవి, తిరుపతి నగర ఆఫీస్ బేరర్ సమావేశంలో రాజశేఖర్ ను బాధ్యతల నుంచి తొలగిస్తున్నట్లు తెలిపారు. ఎస్వీయూలో పరిశోధన విద్యార్థి సునీల్‌ని హాస్టల్ వాచ్ మెన్ గా పనిచేస్తున్న రాజశేఖర్ మాటల సందర్భంలో కులం పేరుతో దూషించారని, స్కాలర్స్ సునీల్‌ని అగౌరవపరిచినట్లు భావించి ఈ చర్యలకు పాల్పడినందుకు సంఘ నిబంధనల ప్రకారం హాస్టల్ వర్కర్స్ యూనియన్ ఎంఎంఆర్ అధ్యక్షులుగా కే.రాజశేఖర్ ని తొలగించి అతని స్థానంలో కే. మణికంఠకు అధ్యక్ష బాధ్యతలు అప్పగించినట్లు ఏఐటియుసి తీర్మానం చేయడం జరిగిందనారు. ఎస్వీయూలో అనేక సమస్యలపై పోరాడిన ఏఐటీయూసీ కి మంచి గుర్తింపు ఉందని ఇలాంటి చర్యలకు పాల్పడిన మా సంఘ కార్మికులపై కఠినమైన నిర్ణయాలు తీసుకుంటామని తెలియజేశారు. భవిష్యత్తులో యూనివర్సిటీలో ప్రశాంత వాతావరణం ఉండాలని ఏఐటియుసి గా భావిస్తున్నది. అలాగే పరిశోధన విద్యార్థి సునీల్ కు ఏఐటీయూసీ యూనియన్ నుంచి జరిగిన సంఘటనను ఖండిస్తున్నాము.

శ్రీవారి ఆలయ మాడ వీధులను తనిఖీ చేసిన అదనపు ఈవో

విశాలాంధ్ర-తిరుమల కల్చరల్: తిరుమలలోని శ్రీవారి ఆలయ నాలుగు మాడ వీధుల్లోని గ్యాలరీలను ఆదివారం సంబంధిత అధికారులతో కలిసి టీటీడీ అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి పరిశీలించారు. శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 4 నుండి 12 వరకు జరుగనున్న నేపథ్యంలో, నాలుగు మాడ వీధుల్లో ఉన్న వివిధ ప్రవేశ మరియు నిష్క్రమణ,

హారతి పాయింట్ల గురించి తెలుసుకోవడానికి అన్ని గ్యాలరీలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.వాహన మండపం నుంచి ప్రారంభమై నాలుగు మాడ వీధుల్లోని గ్యాలరీలు, తిరుమల నంబి ఆలయం వద్ద కదిలే వంతెన, గ్యాలరీల వద్ద ప్రవేశ నిష్క్రమణ పాయింట్లు మరియు ఇతర సంబంధిత సమాచారాన్ని అధికారులు అదనపు ఈవోకు వివరించారు.ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, విజివో నంద కిషోర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బోయకొండపై పెరిగిన భక్తుల రద్దీ

విశాలాంధ్ర-చిత్తూరు: ఆదివారం అమావాస్య అందులోనూ ఆషాడ మాసం చివరి రోజున బోయకొండపై యాత్రికుల రద్దీ పెరిగింది ఉదయాన్నే ఆలయ వేద పండితులు అర్చకులు ఆధ్వర్యంలో బోయకొండ గంగమ్మకు విశేష అభిషేకము అలంకరణ నిర్వహించారు సాయంత్రం వరకు క్యూ లైన్ లన్నీ భక్తులతో కిటకిటలాడాయి ఆషాడం చివరి ఆదివారం అమావాస్య రోజున అమ్మవారికి పూజలు నిర్వహిస్తే శుభం జరుగుతుందన్న నమ్మకంతో రాష్ట్రం తో పాటు తమిళనాడు కర్ణాటకల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు కొండపైన ఎక్కడ చూసినా భక్తుల సందడి కనిపించింది అధిక సంఖ్యలో వచ్చిన యాత్రికులకు ఆలయ ఈవో ఉప కమిషనర్ ఏకాంబరం అధికార సిబ్బంది సేవలందించారు.

తడలో టీడీపీ వర్గపోరు

ఫ్లెక్సీలో మా నాయకుడు ఫోటో లేదంటూ కొండేపాటి వర్గం అలక

అందరం కలిసి పని చేద్దాం... ఎమ్మెల్యే నెలవల విజయ్ శ్రీ

విశాలాంధ్ర-తడ: సూళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందిన నెలవల విజయశ్రీ తడ మండలంలోని తడ లోఆదివారం నిర్వహించే విజయోత్సవ సభ కు స్థానిక నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో తమ నాయకుడి ఫోటో లేకపోవడంతో ఓ వర్గం నాయకులు బాయ్ కాట్ చేయడంతో తెలుగుదేశం పార్టీలో వర్గ పోరు బయటపడింది. స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తడ మండలానికి వచ్చేయుచున్న సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో తెలుగుదేశం పార్టీ నాలుగు నియోజకవర్గాలకు ఇంచార్జ్ అయిన కొండేపాటి గంగా ప్రసాద్ ఫోటోను ఫ్లెక్సీలో వేయకపోవడంతో తడ మండలంలో గల ఆయన అనుచర వర్గం తమ నాయకుడి ఫోటో వేయకుండా విజయోత్సవ ఎలా జరుగుతుందంటూ అలక చెందడం తో 10:30 గంటలకు ప్రారంభం కావలసిన కార్యక్రమం 12:30 గంటలకు ప్రారంభమైంది. ఈ సంఘటనతో తెలుగుదేశం పార్టీలో అంతర్గత వర్గ పోరు బయటపడ్డ పరిస్థితి ఏర్పడింది. దీనిపై నెలవల విజయశ్రీ ఆత్మీయ సభలో మాట్లాడుతూ నాయకులు కార్యకర్తలు అందరం కలిసి కట్టుగా పనిచేద్దామని పిలుపు నిచ్చారు. చిన్న చిన్న మనస్పర్థలు వున్నా కలిసి మెలిసి పార్టీ అభివృద్ధి కి పాటు పడతామని తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

గూడూరు - విశాలాంధ్ర: కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మ హత్య చేసుకున్న సంఘటన గూడూరు రైల్వే స్టేషన్ పరిధిలోని సౌత్ యార్డ్ వద్ద చోటుచేసుకుంది. రైల్వే పోలీస్ ల కథనం మేరకు మృతుడు.గూడూరు రెండొ పట్టణ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ కి చెందిన నాగూర్‌గా గుర్తించామన్నారు. కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మ హత్య చేసుకున్నాడు అనీ విచారణలో తేలింది అన్నారు.అనంతరం కేసు నమోదు చేసి దర్యప్తు చేస్తున్నామన్నారు. అనంతరం పోస్టుమార్టరం నిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రి కి తరలించమన్నారు.

రామసుబ్బమ్మ కర్మక్రియలకు హాజరైన ఎమ్మెల్యే నాని

విశాలాంధ్ర-చంద్రగిరి: చంద్రగిరి మండలం, గంగుడుపల్లి పంచాయతీకి చెందిన పందిగుంట రామ సుబ్బమ్మ కర్మ క్రియలకు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఆదివారం హాజర య్యా రు. గత నెల 23న ఆమె పరమ పదించారు. ఆదివారం గంగుడుపల్లి గ్రామంలో పందిగుంట రామసుబ్బ మ్మ ఇంటి వద్ద జరుగుతున్న కర్మ క్రియలకు పులివర్తి నాని పార్టీ నాయకులతో కలిసి హాజరయ్యారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని అన్నారు.

ప్రైవేట్ స్కూళ్లపై విద్యాధికారులు చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-వెంకటగిరి: వెంకటగిరి టౌన్ లోని కొన్ని ప్రైవేట్ స్కూల్స్ ఆదివారం పూట అనధికారికంగా టెన్త్ క్లాస్ విద్యార్థులకు తరగతులు నడుపుతున్నారు అని స్టూడెంట్స్ వద్ద ఉండి వెంకటగిరి ఏఐఎస్ఎఫ్ మరియు ఏఐవైఎఫ్ విద్యార్థి యువజన సంఘాలకు ఫిర్యాదులు అందగా విద్యార్థి యువజన సంఘాలు కలిసి ప్రైవేట్ స్కూల్స్ నడుపుతున్న యాజమాన్యంతో మాట్లాడి విద్యార్థులను ఇంటికి పంపడం జరిగినది. ఇకపైన ఇలాంటి అనధికారికంగా విద్యార్థులకు తరగతులు నడిపినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి వెంకటగిరి యువజన సంఘం రాతపూర్వకంగా ఫిర్యాదు ఇవ్వడం జరిగినది. ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం అనధికారికంగా రెంటుకు గదులు తీసుకుని ట్యూషన్ పేరుతో ఏ బోర్డులు మరియు ఫీజులు తీసుకోకుండా హెూమ్ ట్యూషన్ పేరుతో అనధికారికంగా నడుపుతున్నారు వీటిపై విద్యార్థి మరియు యువజన సంఘాలకు ఏఐఎస్ఎఫ్ మరియు ఏఐవైఎఫ్ సమాచారం అందినది దయచేసి విద్యార్థుల తల్లిదండ్రులు వీటిపై ఏమైనా ఫిర్యాదు ఇవ్వదలచిన వారు మా విద్యార్థి మరియు యువజన సంఘాలకు తెలియజేయవచ్చు.

పాకాల అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి కృషి

చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని

విశాలాంధ్ర - పాకాల : పాకాల మండల అభివృద్ధి, మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత నిస్తానని చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని తెలిపారు. ఆదివారం స్థానిక పట్టణంలోని వెలుగు కార్యాలయంలో ఎంపీపీ లోకనాథం అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వ సభ్య సమావేశంలో ఎమ్మెల్యే పులివర్తి నాని ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాకాల తన సొంత మండలమని పాకాలను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యేగా రాజకీయాలకు, కక్ష సాధింపులకు పాల్పడబోనన్నారు తన శక్తి మేరకు పాకాల మండల అభివృద్ధికి, మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, కేవలం ఎన్నికలకు మునుపు మాత్రమే రాజకీయం చేస్తానని అంతవరకు తన దృష్టంతా అభివృద్ధిపైనేనన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు తనకు సహకరించాలని కోరారు. సమావేశంలో పాల్గొన్న అధికారులు మాట్లాడుతున్నప్పుడు శ్రద్ధగా విని సందేహాల పై వారి నుండి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అధికారులు సభ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను వచ్చే సమావేశంలోపు పరిష్కారమయ్యే విధంగా కృషి చేస్తానన్నారు. పాకాల, దామలచెరువు బైపాస్ రోడ్డు ఏర్పాటుకు ప్రయత్ని స్తానన్నారు. పాకాల మండలంలో గంజాయి, పక్క రాష్ట్రాల నుండి వచ్చే మద్యం పెద్ద సమస్యగా తయారైందని దీనిని సంబంధిత అధికారులు అరికట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ పథకాలు పేదలకు చేరువయ్యేలా వాటి గురించి ముందుగా స్థానిక ప్రజాప్రతినిధులకు, నాయకులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి పద్మజా రెడ్డి, ఎంపీడీవో నాగేంద్రబాబు, తహసిల్దార్ నిత్యానంద బాబు, సిఐ రాజగోపాల్, ఎంపీటీసీలు, సర్పంచులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి శ్రీనివాస వర్మకు పుట్టినరోజు శుభాకాంక్షలు

విశాలాంధ్ర-తిరుపతి: కేంద్ర పరిశ్రమలు మరియు ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ పుట్టినరోజు సందర్భంగా తిరుపతిలో రాజు క్షేత్రాణీ ఐక్యవేదిక అధ్యక్షురాలు రుద్రరాజు శ్రీదేవి రాజు కన్వీనర్ గుంటమడుగు వసంత రాజు ఎస్‌టిఆర్‌ఎఫ్ రీజనల్ కోఆర్డినేటర్ గుండ్రాజు సుకుమార్ రాజుల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఓ ప్రైవేట్ హెూటల్లో కేక్ కట్ చేసి శాలువా కప్పి సన్మానించారు. కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ తిరుమల పర్యటనలో భాగంగా తిరుపతిలో రాజుల ఆధ్వర్యంలో ఈ పుట్టిన రోజు వేడుకలు జరిగాయి ఈ కార్యక్రమంలో వీరితోపాటు స్థానిక ఎమ్మెల్యే జంగాలపల్లి శ్రీనివాసులు బిజెపి నాయకులు భాను ప్రకాష్ రెడ్డి పొన్నగంటి భాస్కర్ కోలా ఆనంద్ పలువురు క్షత్రియ సోదరులు శంకర్ రాజు, వెంకటేష్ రాజు, హేమంత్ రాజు, సుందర కుమార్ రాజు, గుండ్రాజు వెంకటేశ్వర్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ద్రౌపతి కళ్యాణం

విశాలాంధ్ర-పాకాల: పాకాల మండలం దామల చెరువు గ్రామపంచాయతీ మబ్బు నాయన పల్లిలో మబ్బునేని చైతన్యకుమార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యం లో జరుగుతున్న మహాభారత మహోత్సవాలలో భాగంగా ఆదివారం మధ్యాహ్నం ద్రౌపది కళ్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ద్రౌపది కల్యాణాన్ని తిలకించారు. రాత్రి ద్రౌపతి స్వయంవరం, ద్రౌపతి కళ్యాణం నాటకం ప్రదర్శించారు. మబ్బునేని పల్లికి చెందిన మబ్బునేని రాము కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో ట్రస్ట్ చైర్మన్ మబ్బునేని రఘుపతి, ట్రస్ట్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హథీరాం బావాజీ ఆలయంలో ఘనంగా బోగ్ బండారో ఉత్సవం

విశాలాంధ్ర -తిరుపతి రూరల్: శ్రీ హథీరాం బావాజీ ఆలయంలో బోగ్ బండారో ఉత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. తిరుపతి రూరల్ మండలం, విద్యుత్ నగర్ లోని హథీరాం బావాజీ ఆలయంలో రెండు రోజులు పాటు నిర్వహించిన ఈ ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, ఆలయ ఛైర్మన్ బుక్య శివ నాయక్ ఆధ్వర్యంలో బోగ్ బండారో కార్యక్రమాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. హథీరాం బావాజీ ఆలయంలో ప్రత్యేక పూజలు, కోలాటాలు, నామ సంకీర్తనం, నాట్య ప్రదర్శన వంటి కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవ మూర్తి ఊరేగింపును అత్యంత కోలాహలంగా చేపట్టారు. మేళా తాళాలు వైద్య సంగీత సమ్మేళనం నడుమ హథీరాం బావాజీ ఊరేగింపు కనువిందు చేసింది. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త బుక్య శివ నాయక్ మాట్లాడుతూ కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవెంకటేశ్వరునితో స్నేహ బంధం పొందిన పర్వదినం, శ్రీవారికి తొలిసారి బాలాజీ అన్న మరో నామకరణం చేసిన ఘన చరిత్ర హథీరాం బావాజీ కే దక్కుతుందన్నారు. ఈ శుభ పర్వదినం సందర్భంగా బోగ్ బండారో ఉత్సవంగా జరుపుకుంటామన్నారు. నేడు ఆడి అమావాస్య రోజున ప్రతి ఏటా ఈ ఉత్సవాలు జరుగుతాయన్నారు. బంజారాల ఆరాధ్య దైవం శ్రీహథీరాం బావాజీ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతి ఒక్క బంజారా బిడ్డలు జాతి గర్వించేలా కాపాడాలని ఆయన అన్నారు. స్వామి హథీరాం బావాజీ బాల్యంలోనే 1200 సంవత్సరాల క్రితం ఉత్తర భారతదేశం నుంచి శ్రీరాముడు భక్తుడిగా తీర్థయాత్రలు చేస్తూ ఆయన తిరుమలకు చేరుకున్నారు. అయితే శ్రీ వేంకటేశ్వరుని దివ్య మంగళ విగ్రహాన్ని చూసిన ఆయన మనసు అక్కడే లగ్నమైపో యిందన్నారు. తోటి యాత్రికులంతా వెళ్లిపోయినా, ఆయన తిరుమలలోనే ఉండి నిత్యం వేంకటేశ్వరుని దర్శించుకునేవారని చరిత్ర చెబుతోంది అన్నారు. తిరుమలలో హథీరాం బావాజీ ధ్యానంలో ఉండగా స్వయానా శ్రీవెంకటేశ్వరస్వామి ఆయనకి ప్రత్యక్షమై దర్శనమిచ్చారని గుర్తు చేశారు. ఆయన పరమ భక్తి నీ మెచ్చిన శ్రీవారు స్నేహ హస్తాన్ని అందించారని చెప్పారు. హథీరాం బావాజీ ద్వారా యావత్ బంజారాలకు దక్కిన గౌరవంగా భావిస్తున్నామన్నారు. భారీ ఎత్తున హథీరాం బావాజీ ఆలయ పునర్నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు గుండాల నాయక్, అధ్యక్షులు చలపతి నాయక్, ట్రెజరర్ హరిబాబు నాయక్, శివ నాయక్, కుసుమహరి, సామ్రాజ్ నాయక్, బాలాజీ, శీను నాయక్, ప్రభాకర్ నాయక్, కిషోర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి కార్యకర్తలు ఎలాంటి త్యాగానికైనా సిద్ధం కావాలి

చిత్తూరు జిల్లా సిపిఐ కార్యదర్శి యస్. నాగరాజు పిలుపు

విశాలాంధ్ర -చిత్తూరు : జిల్లా సమగ్రాభివృద్ధి కోసం సిపిఐ కార్యకర్తలు ఎలాంటి త్యాగాలకైనా సిద్ధంగా ఉండాలని చిత్తూరు జిల్లా సిపిఐ కార్యదర్శి నాగరాజ్ పిలుపునిచ్చారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ చిత్తూరు జిల్లా జనరల్ బాడీ సమావేశం ఆదివారం నగరంలో ఎస్ఎంవి కల్యాణ మండపంలో టి.కోదండయ్య అధ్యక్షతన జరిగింది. సమావేశంప్రారంభానికి ముందు కేరళ రాష్ట్రంలో వరదల్లో మరణించిన వారికి సమావేశం ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసింది ఈ సందర్భంగా సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్ .నాగరాజు మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో భారత కమ్యూనిస్టు పార్టీ ప్రజా సంఘాల పరిస్థితిని, జిల్లా కార్యవర్గ సభ్యుల పని విధానాన్ని వివరించారు. చిత్తూరు జిల్లా లో పార్టీని ప్రజాసంఘాలను బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త సిద్ధపడాలని తెలిపారు. జిల్లాల విభజన సందర్భంగా అటు కర్నాట, ఇటు తమిళనాడు రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్నప్పటికీ చిత్తూరు జిల్లా పూర్తిగా వెనకబడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా చిత్తూరు జిల్లా అభివృద్ధికి నోచుకోక పోవడం బాధాకరమన్నారు. అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు ప్రజా ప్రతినిధులు జోక్యం చేసుకొని అభివృద్ధికి సహకరించాలని డిమాండ్ చేశారు.సమావేశంలో వెనుకబడిన చిత్తూరు జిల్లాలో కేంద్రవిశ్వవిద్యాలయాలు, పూర్తిగా ప్రభుత్వ ఆధ్వర్యంలో కొనసాగే ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని, హంద్రీనీవా గాలేరు నగరి కాలువలను పూర్తి చేయాలని జిల్లాలో ప్రభుత్వ భూములను, క్వారీలను కబ్జా చేస్తున్న నాయకులను అరికట్టాలని,మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయం నిప్పు పెట్టిన దుండగులను శిక్షించాలని చదువుకున్న నిరుద్యోగులకు ఉపాధి కల్పించడానికి పరిశ్రమల స్థాపించాలని, చిత్తూరు జిల్లాలో గ్రీన్ అంబాసిడర్ గా పనిచేస్తున్న కార్మికులకు 25 నెలల పెండింగ్ జీతాల మంజూరుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది ఈ సమావేశంలో తిరుపతి జిల్లా సిపిఐ కౌన్సిల్ సభ్యులు ఏం శ్రీరాములు, పార్టీ సీనియర్ నాయకులు కే.మణి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం .సుబ్రహ్మణ్యం, దాసరి చంద్ర, ఎం.విజయకుమార్, కే.విజయ గౌరీ, కే .రమాదేవి,బి .కుమారి,వి. కోమల, పి రఘు పాల్గొని ప్రసంగించారు . సమావేశంలో నగరి ,పుంగనూరు, పలమనేరు, పూతలపట్టు, జీ డి నెల్లూరు ,చిత్తూరు నియోజకవర్గం నుండి సిపిఐ కార్యకర్తలు ,ప్రజా సంఘాల నాయకులు హాజరయ్యారు.

తెలుగుదేశం ప్రభుత్వంతోనే అభివృద్ధి
- టిడిపి ఇన్చార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం

విశాలాంధ్ర-సూళ్లూరుపేట: .తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలోని శాసన సభ్యురాలు నెలవల విజయశ్రీ నివాసము నందుసూళ్లూరుపేట తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నవ్యాంధ్రప్రదేశ్ను స్వర్ణాంధ్రప్రదేశ్గా తీర్చిదిద్దేందుకు నిరంతరం శ్రమిస్తూ సంక్షేమం అభివృద్ధి 2 సమపాలనలో పరిపాలన సాగిస్తున్న అభివృద్ధి ప్రదాత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ నెలవలసుబ్రహ్మణ్యం అన్నారు. ఆవేశపూరితమైన ఆలోచనలతో రాష్ట్రంలో పలు ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టి 11 లక్షల కోట్ల రూపాయలనురాష్ట్రాన్ని అప్పుల ఊబిలో కూరుకు పోయేలా చేసి 20 సంవత్సరాల రాష్ట్ర అభివృద్ధిని వెనక్కు వేసిన ఘనత వైఎస్ఆర్ దని, రాష్ట్ర సంక్షేమం, అభివృద్ధి గురించి మాట్లాడడం హాస్యస్పద మన్నారు. ఈ ప్రాంతంలో మత్స్యకారులకు ప్రధాన సమస్యగా దశాబ్దాల కాలంగా నెలకొని ఉన్న పులికాట్ ముఖద్వారాల పూడికతీత కార్యక్రమానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో 179 కోట్ల రూపాయలు మంజూరు చేసినట్లు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రకటిం చారని మత్స్యకారుల కల నెరవేరనున్నదని అభినందనీ యమన్నారు. గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న 2014 నుండి 2019 సంవత్సరం మధ్య 24000 కిలోమీటర్లు సిసి రోడ్లు వేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి దక్కుతుందన్నారు. ప్రస్తుతం మండలానికి రెండు కోట్లు చొప్పున నియోజవర్గంలో 12 కోట్ల రూపాయలు ఎన్ఆర్ఈజీఎస్ నిధుల కింద సిసి రోడ్లు డ్రైన్ల నిర్మాణానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిధులను మంజూరు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఎన్నికల సందర్భంగా ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలలో అన్ని సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టినట్లు ముఖ్యంగా తల్లికి వందనం ఆడబిడ్డ నిధి మూడు సిలిండర్లు గ్యాస్ సౌకర్యం, మహిళలకు ఆర్టీసీ బస్సు ఉచిత ప్రయాణం అన్న క్యాంటీన్, పథకాలను త్వర లోనే ప్రారంభించినట్లు నెలవల తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు ఆకుతోట రమేష్, తిరుమూర్ సుధాకర్ రెడ్డి, ఐవి సురేష్, నరేంద్ర రెడ్డి, తదితరులు ఉన్నారు.

సత్యవేడు వెలుగు కార్యాలయాన్ని కమ్మేస్తున్న చీకటి
ఐదు కోఆర్డినేటర్ల పోస్టుల ఖాళీలతో ఒక్కరే విధులు

విశాలాంధ్ర-సత్యవేడు: సత్యవేడులో కొనసాగుతున్న గ్రామీణాభివృద్ధి సంస్థ(వెలుగు) కార్యాలయాన్ని చీకటి కమ్మేస్తుంది. ఈ కార్యాలయంలో 6 మంది కోఆర్డినేటర్లకు గాను ఐదు పోస్టులు భర్తీ కాకపోవడంతో ఒక్క సీసీ మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు.దీంతో కార్యాలయం నిర్వహణలో ఇబ్బందులు తప్పడం లేదు.ప్రస్తుతం స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీఎంగా స్వర్ణలత, కోఆర్డినేటర్గా పయని పనిచేస్తున్నారు.ఈ నేపథ్యంలో మండలంలో కొనసాగుతున్న డ్వాక్రా సంఘాలకు సంబంధించి బ్యాంకు లింకేజీ రుణాలు,శ్రీనిధి,గ్రామ సంఘం రుణాల మంజూరు,రికవరీ వంటి వాటిని పర్యవేక్షించడం తలకు మించిన భారంగా మారుతుంది.పైగా డ్వాక్రా సంఘాల సభ్యులు బ్యాంకు నుంచి తీసుకున్న లింకేజీ రుణాలను సక్రమంగా చెల్లిస్తున్నాయా లేదా? వంటి పలు అంశాలకు సంబంధించి ప్రతి నెల ఆయా క్లస్టర్ల వారిగా సమావేశం నిర్వహించి సమీక్షించాల్సిన బాధ్యత వెలుగు కోఆర్డినేటర్లపై ఉంది.అయితే ఇక్కడ సిబ్బంది కొరత వెంటాడుతున్న నేపథ్యంలో పూర్తిస్థాయిలో పర్యవేక్షణకు వీలు లేకుండా పోతుంది. దీన్ని ఆసరా చేసుకుని మండలంలో ఇప్పటికే పలు గ్రామాల్లో పనిచేస్తున్న కొందరు సంఘమిత్రలు బ్యాంకు లింకేజీ,గ్రామసంఘం,శ్రీనిధి,పొదుపు వంటి పలు రకాల రుణాలను స్వాహా చేసిన ఘటనలు వెలుగు చూసాయి.దీనిపై విచారణ చేపట్టిన వెలుగు అధికారులు రికవరీ కోసం సంబంధించిన సంఘమిత్రలకు నోటీసులు ఇవ్వడంతోపాటు స్వాహా సొమ్మును రాబట్టడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో సత్యవేడు వెలుగు కార్యాలయంలో వెంటాడుతున్న సిబ్బంది కొరతను తీర్చాలన్న వాదనలు వినిపిస్తోంది.గతంలో ఇక్కడ సీసీగా పనిచేసిన గంగులప్ప ఏడాది క్రితమే శ్రీకాళహస్తికి బదిలీ చేయించుకుని వెళ్లిపోయారు.మరో సిసి గోపి రెండేళ్ల క్రితం నాగలాపురం మండలానికి బదిలీ అయ్యారు.అలాగే కోఆర్డినేటర్లు పుల్లయ్య,జీవ ఇద్దరు కోఆర్డినేటర్లు కూడా అవినీతి ఆరోపణలపై సస్పెండ్ అయ్యారు.ఈ నేపథ్యంలో స్థానిక వెలుగు కార్యాలయంలో సిబ్బంది ఖాళీ అయ్యారు.ఆరు కోఆర్డినేటర్ పోస్టులు ఉండగా ప్రస్తుతం సీసీగా పయని ఒక్కరే పని చేస్తున్నారు.ఈ క్రమంలో డ్వాక్రా సంఘాలకు సంబంధించి శ్రీనిధి,బ్యాంకు లింకేజీ,గ్రామ సంఘం రుణాలకు సంబంధించి మంజూరు, చెల్లింపుల సమాచారాన్ని ఆన్లైన్లో అప్లోడ్ చేసే పనులు కోఆర్డినేటర్తో పాటు సంబంధిత ఏపిఎంపై కూడా పడింది.కార్యాలయంలో ఖాళీగా ఉన్న ఐదు కోఆర్డినేటర్ల పోస్టుల భర్తీలో సంబంధించిన జిల్లా డిఆర్డిఏ అధికారులు నిర్లక్ష్యం చూపడంపై సర్వత్ర విమర్శలు వినిపిస్తున్నాయి.ఇప్పటికైనా సంబంధిత డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ దీనిపై స్పందించి సత్యవేడు గ్రామీణ అభివృద్ధి సంస్థ కార్యాలయంలో ఖాళీగా ఉన్న సీసీ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక : జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర -చిత్తూరు : చిత్తూరు కలెక్టరేట్ లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో సోమవారం ఉదయం10 గం.ల నుండి మధ్యాహ్నం1 గం.వరకు కలెక్టరేట్ లోని నూతన సమావేశపు మందిరం నందు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పక హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు.

తిరుమల శ్రీవారిని సేవలో మంత్రి కొలుసు పార్థ సారథి

విశాలాంధ్ర -తిరుపతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల సమస్యలపై అలుపెరగక పోరాడుతూ ప్రజా సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా అహర్నిశలు కృషి చేయుచున్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మరియు మంత్రి లోకేష్ కి ఆ తిరుమల ఏడు కొండల స్వామి ఆశీస్సులు అండదండలు ఉండాలని శ్రీవారిని కోరుకున్నానని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మరియు గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థ సారథి పేర్కొన్నారు.నేటి ఆదివారం ఉదయం విఐపీ విరామ సమయంలో మంత్రి తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆలయం వెలుపల మీడియా తో మాట్లాడుతూ రాష్ట్రంలోని అల్పాదాయ వర్గాలకు చెందిన పేద ప్రజలకు, అలాగే జర్నలిస్టులకు కూడా తక్కువ ధరతో ఇల్లు అందించాలని సమున్నత లక్ష్యంతో ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గృహ నిర్మాణ శాఖ కట్టుబడి ఉందని తెలిపారు. టిడ్కో ఇల్లు, పిఎంఎవై కింద పురోగతిలో ఉన్న ఇల్లు, పెండింగ్ ఇళ్ళ నిర్మాణాలను ఒక ప్రణాళిక బద్ధంగా లక్ష్యాలను నిర్దేశించుకుని ఒక సంవత్సరం లో పూర్తి చేసి లబ్దిదారులకు అందచేసేలా ముఖ్యమంత్రి చేసిన సూచనల మేరకు లక్ష్య సాధన పూర్తి చేసి లబ్ధిదారులకు ఇళ్లను అందజేస్తామని తెలిపారు.అనంతరం మంత్రి తిరుపతి చేరుకుని స్థానిక కార్యక్రమంలో పాల్గొని తిరుగు ప్రయాణం కానున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి బాల కొండయ్య, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి వేకటేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

యువతరం సేవలకు సేవా పురస్కారం అవార్డు ప్రదానం

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి: యువతరం సేవా సంస్థ చేస్తున్న సేవలకు గుర్తింపుగా సేవా పురస్కారం అవార్డును అందుకున్నారు. యువనేస్తం అసోసియేషన్ ఆధ్వర్యంలో చేస్తున్న సేవలను గుర్తించి ఆదివారం శ్రీకాళహస్తిలో యువతరం సేవా సమితి పది సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వసుదైక కుటుంబం అనే కార్యక్రమం లో భాగంగా ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణలో ఉన్నటువంటి స్వచ్ఛంద సేవా సంస్థ సేవకులకు తమ సేవలకు గుర్తింపు గాను సేవా పురస్కారం అవార్డును ఎన్ఎహెచ్ఐ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు చేతుల మీదుగ యువ నేస్తం అసోసియేషన్ అధ్యక్షులు వినోద్ రెడ్డి కి యువతరం సేవా సంస్థ చైర్మన్ యువ కిషోర్, సభ్యులకు కలిసి అందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎహెచ్ఐ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు, రాష్ట్రంలోని అన్ని స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
అక్షరాక్షరం అభ్యుదయం
విలేకరులు కావలెను
విశాలాంధ్ర తెలుగు జాతీయ దినపత్రికలో చిత్తూరు, తిరుపతి జిల్లాలో
దిగువ తెలిపిన మండలాల్లో పనిచేయుటకు స్థానికంగా ఉన్న అభ్యర్థులు కావలెను.
ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై, తెలుగుభాషపై పరిజ్ఞానం ఉండాలి.
పనిచేయవలసిన మండలాలు :
తిరుపతి సిటీ, వడమాలపేట, నగరి, నాగలాపురం, డక్కిలి, విరాల,
రామచంద్రాపురం, సదుం, యాదమరి, వరదయ్యపాలెం
బంగారుపాలెం, రొంపిచెర్ల, పూతలపట్టు, శాంతిపురం, గుడుపల్లె
గమనిక: ఆయా మండలాల్లో స్థానికులై ఉండాలి
సంప్రదించవలసిన నెంబరు: 9490952134